విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

శనివారం 19 ఏప్రిల్ 2025 8 పేజీలు

నేతలకు వాతలు...అధికారులకు కాసులు

- ప్రభుత్వ నిర్ణయంపై తీవ్ర చర్చ
- పురపాలక నేతలలో నైరాశ్యం

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: కూటమి ప్రభుత్వం తాజాగా తీసుకోబోతున్న ఓ నిర్ణయంపై రాష్ట్ర పురపాలక వర్గాల నేతలలో తీవ్రస్థాయిలో చర్చలు జరుగుతున్నాయి. ప్రస్తుతం నూతన నిర్ణయం అమలు చేస్తే పురపాలక సంఘాలలో తమ ఉనికి ప్రశ్నార్థకం అవుతుందనేది వీరి వాదన. మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థలకు సంబంధించి కూటమి ప్రభుత్వం సంచల నిర్ణయం తీసుకునే దిశగా అడుగులు వేస్తోందని సమాచారం. మున్సిపాలిటీలలో ప్రస్తుతం పలు ఆస్తులను అద్దెకు ఇచ్చి వాటి ద్వారా వస్తున్న ఆదాయాన్ని ఇతర ఖర్చులకు వినియోగిస్తున్నారు. ముఖ్యంగా విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, రాజమండ్రి, కాకినాడ, ఏలూరు, తిరుపతి, కర్నూలు, కడప, అనంతపురం నగరపాలక సంస్థలకు అద్దెలు, స్థలాల లీజుల ద్వారా భారీ ఎత్తున ఆదాయం వస్తోంది. ఇలా వస్తున్న ఆదాయాన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల బ్యాంకు ఖాతాలలో జమచేసి కౌన్సిల్ తీర్మానాలు చేసి వాటిని వివిధ అభివృద్ధి పనులకు ఖర్చు పెడుతున్నాయి. ప్రస్తుతం కూడా అలానే జరుగుతోంది. ఇలా కార్పొరేషన్‌లోని మేయర్లు, కౌన్సిల్ చైర్మన్లు నిధులు తీసుకొని స్వయంగా ఖర్చు చేస్తున్న క్రమంలో నిధుల దుర్వినియోగం పెరిగిపోయిందన్న వాదన బలంగా వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ముఖ్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విధానాన్ని మార్చేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. దీనిలో భాగంగా అధికారులకే నేరుగా ఆ నిధులు అందేలా చర్యలు తీసుకోబోతున్నారని వినికిడి. ఇంటి అద్దెలు, లీజుల రూపంలో వస్తున్న ఆదాయాలను ప్రత్యేక ఖాతాలలో జమచేసి వాటిని కార్పొరేషన్ కమిషనర్, ఆయా జిల్లాల కలెక్టర్ల ఆధీనంలో ఉంచనున్నారు. వారే స్వయంగా ఆయా నిధులను ఖర్చు చేసేలా జీవో తీసుకువస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇదే జరిగితే నగరాలు, పట్టణాలు మరింత అభివృద్ధి చెందడంతో పాటు ప్రాధాన్యాల వారీగా పనులు చేపట్టేందుకు అవకాశం ఉంటుందన్న ఆలోచ నలో ఉన్నారు. ఈ నిర్ణయం బాగానే ఉన్నా రాజకీయంగా కార్పొరేషన్లు, మున్సిపాలిటీ పాలక వర్గాలు దీనిని తీవ్రంగా వ్యతిరేకించే అవకాశాలు లేకపోలేదు. నిధుల వినియోగం అనేది కీలక బాధ్యత. అధికారం తమకు లేకుండా పోతే ఇక తాము చేసేది ఏముంటుందన్న ప్రశ్నలు పాలకవర్గాల నేతలు లేవనెత్తుతున్నారు. ప్రస్తుతం వైసీపీ అధిక శాతం మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో అధికారంలో ఉంది. రేపు టిడిపి వాటిని కైవసం చేసుకుంటే అప్పుడు కూడా ఇదే విధానం పాటిస్తే తమకు ఇక ▶మిగతా 2లో..

ఇసుక ఏజెన్సీలు జవాబుదారీతనంతో ఉండాలి

- ఐవిఆర్ఎస్ ద్వారా వినియోగదారుల నుంచి ప్రజాభిప్రాయ సేకరణ
- ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి
- కలెక్టర్ పి. ప్రశాంతి

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : రానున్న వర్షాకాలం దృష్ట్యా జిల్లాలో డెసిల్టేషన్, ఓపెన్ రిచెస్, సెమీ మెకనైజ్డ్ పాయింట్స్ ద్వారా తవ్వకాలు చేపట్టి 12 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను 45 రోజులలోగా గుర్తించిన స్టాక్ యార్డులలో అందు బాటులో ఉండేలా చూసుకోవాలని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన "ప్రామాణిక కార్యాచరణ విధానం" అనుసరించి ఇసుక స్టాక్ పాయింట్ ద్వారా ఏజెన్సీస్ ▶మిగతా 2లో..

సౌకర్యాల కల్పనకు

రూ.949 కోట్లు విడుదలకై వినతి

మేయర్ షేక్ నూర్జహాన్

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : నగరపాలక సంస్థలో ప్రజల అవసరాలను తీర్చడానికి నగరపాలక సంస్థలో విలీనమైన 7 పంచాయతీలకు సకల సౌకర్యాలు కల్పించడానికి కార్పొరేషన్‌కు రూ.949.41 కోట్లు అవసరం అవుతాయని అంచనాలతో కూడిన మెమోరాండం 16వ ఆర్థిక సంఘం చైర్మన్ డాక్టర్ అరవింద్ పన్ గారియా, సభ్యులు అన్నే జార్జ్ మాథ్యు, డాక్టర్ మనోజ్ పాండాకు అందజేశామని మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు తెలిపారు. 16వ ఆర్థిక సంఘం చైర్మన్ మరియు కమిటీ సభ్యులతో తిరుపతిలో జరిగిన సమావేశంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపల్ కార్పొరేషన్లు మేయర్లు, మున్సిపాలిటీల చైర్మన్లు తరపున మేయర్ నూర్జహాన్ పెదబాబు 16వ ఆర్థిక సంఘం చైర్మన్ డాక్టర్ అరవింద్ పన్ గారియాకు వినతి పత్రాన్ని అందచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ప్రజల అవసరాలు తీర్చడానికి రూ.1 లక్ష 28 వేల కోట్ల రూపాయలు అవసరం అవుతాయని 16 ఆర్థిక సంఘం చైర్మన్ డాక్టర్ అరవింద్ పన్ గారియాకు ▶మిగతా 4లో..

తణుకు అభివృద్ధికి ముందుకు రావాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర -తణుకు: తణుకు పట్టణంలోని పార్కుల అభివృద్ధికి పారిశ్రామిక వేత్తలు, దాతలు సహకారం ఎంతో అవసరమని కలెక్టర్ చదలవాడ నాగరాణి స్పష్టం చేశారు. శుక్రవారం తణుకు పురపాలక సంఘ కార్యాలయంలో కలెక్టర్ చదలవాడ నాగరాణి అధ్యక్షతన పి-4 లక్ష్యంగా ప్రభుత్వం, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యం భాగంగా పార్కుల అభివృద్ధికి పారిశ్రామికవేత్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సదస్సుకు తణుకు శాసనసభ్యులు ఆరుమిల్లి రాధాకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తణుకు పట్టణంలో పారిశ్రామికవేత్తలు, దాతలు పట్టణంలో పార్కులు, బస్ షెల్టర్స్, ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో మౌలిక సదుపాయాల కల్పనకు తమ వంతు సహకారం అందించాలని కోరారు. తణుకు పారిశ్రామికవేత్తలు, దాతలు ఎంతో చైతన్యతులని, సమాజాభివృద్ధికి తమ వంతు సహకారం అందించడానికి ముందు ఉంటారనేది అందరికీ తెలిసిందేనన్నారు. ఇటీవల కాలంలో దాతలు, పారిశ్రామికవేత్తల సహకారంతో భీమవరం పట్టణంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులపై సభలో వివరించారు. ప్రముఖంగా రైస్ మిల్లర్స్ అసోసియేషన్, కాస్మోపాలిటిన్ క్లబ్, భీమవరం హాస్పిటల్స్, లయన్స్ క్లబ్ తదితర దాతల సహకారం మరువలేనిదన్నారు. ఇతర దాతల సహకారంతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఇప్పటికే చేపట్టిన పనులు దాదాపు పూర్తికావచ్చాయని, కొన్నింటిని ప్రారంభించినట్టు తెలిపారు. ప్రభుత్వం ఒక్కటే అన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేయాలంటే సాధ్యం అయ్యే పని కాదని దీనికి దాతల సహకారం కూడా ఎంతో అవసరమని ఉన్నారు. తణుకు శాసనసభ్యులు ఆరుమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ▶మిగతా 2లో..

గ్రంథాలయ పునర్వికాసాన్ని సాధిద్దాం

అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ

విశాలాంధ్ర-రాజమండ్రి : మరుగునపడిపోతున్న తెలుగు భాష, సంస్కృతి, గ్రంథాలయాల వ్యవస్థకు పునర్వైభవం తీసుకురావాలని దానికి రచయితలు. మేధావులు నడుం బిగించాలని అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక తూర్పు గోదావరి, అంబేద్కర్ కోనసీమ జిల్లాల సమావేశం శుక్రవారం స్థానిక గోదావరి బాలోత్సవం కార్యాలయంలో జరిగింది . అరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గండి స్వామి ప్రసాద్ అధ్యక్షత వహించగా ముఖ్య వక్తగా పాల్గొన్న పెనుగొండ మాట్లాడుతూ సాహిత్య, సాంస్కృతిక, రాజకీయ, మానసిక వికాసానికి తోడ్పడుతున్న గ్రంథాలయాలు కనీస సౌకర్యాలు లేక దీనావస్థలో ఉన్నాయన్నారు. గ్రంథాలయ పునరుజ్జీవనం ద్వారా వెలుగులు నింపే ▶మిగతా 2లో..

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే

గుడ్‌ఫ్రైడే సందర్భంగా శుక్రవారం ఉభయ గోదావరి జిల్లాల్లోని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీస్తు బోధనలను పాస్టర్లు వివరించారు. క్రీస్తు సిలువ మరణం మానవాళికి మార్గదర్శకమని తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ హర్షణీయం

విశాలాంధ్ర -భీమవరం: ఎస్సీ వర్గీకరణను క్యాబినెట్ ఆమోదం తెలపడంపై భీమవరం నియోజకవర్గ టిడిపి ఎస్సీ సెల్ విభాగ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ఎస్సీ సెల్ సమావేశంలో రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు దశాబ్దాల కాలంగా

పోరాటం చేస్తున్న దళితులకు టిడిపి అండగా నిలిచిందన్నారు. ఎస్సీ ఉప కులాలను వర్గీకరించి అందరికీ సమన్యాయం పాటిస్తూ క్యాబినెట్ ఆమోదం తెలపడంపై దళిత ప్రజానీకం హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎద్దు ఏసుపాదం, భీమవరం నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు మాత సురేష్ బాబు, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్ష కార్యదర్శులు యాళ్ల వెంకటేశ్వరరావు, అనపర్తి కృష్ణ ప్రసాద్, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బండి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ మహనీయుడు

విశాలాంధ్ర - నిడమర్రు: మండల కేంద్రమైన నిడమర్రు గ్రామంలో గ్రామ టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మాజీ ముఖ్యమంత్రి కీ.శే. నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) విగ్రహాన్ని శుక్రవారం ఉంగుటూరు శాసన సభ్యులు పత్సమట్ల ధర్మరాజు, ఏలూరు

జిల్లా టీడీపీ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు స్థానిక నేతలతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం అంబళ్ల వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం వారి కుమారులు ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని ఇరువురు నాయకులు ప్రారంభిం చారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయటం అభినంద నీయమని వారిని ప్రసంశించారు.ఈ సందర్భంగా ఇరువురు నాయకులు మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం ఆహార భద్రత, పక్కా గృహాల కల్పనవంటి అనేక సంక్షేమ పథకాల అమలుతో, పేద ప్రజల గుండెల్లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న గొప్ప నాయకుడు ఎన్టీఆర్ అని, అటువంటి మహనీయుని సేవలు నేటి తరాలకు తెలిసేలా వారికి స్ఫూర్తి నిచ్చేలా విగ్రహాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల కూటమి పార్టీల మండల, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజా ప్రతినిధులు, వీర మహిళలు, తెలుగు మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీదత్తాత్రేయ స్వామి విగ్రహ ప్రతిష్ట

విశాలాంధ్ర - కొయ్యలగూడెం :శ్రీదత్తాత్రేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మండలం లొ అంకాల గూడెం గ్రామంలోని భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం 7 గంటల 52 నిమిషాలకు యంత్ర బింబ ప్రతిష్ట, కుంభాభిషేకం,స్వామివారి విగ్రహ ప్రతిష్టను శాస్త్రోక్తంగా అర్చకులు నిర్వహించి విశేష పూజలు నిర్వహించారు. ముందుగా గణపతి పూజ నిర్వహించి మూడు రోజుల పాటు చేసిన హోమగుండంలో

పూర్ణాహుతి సమర్పించారు.16వ తేదీ నుండి ప్రతిష్టాపన ఉత్సవాలు ప్రారంభం కాగా మూడు రోజులు నిత్య హోమాలు అభిషేక పూజలు నిర్వహించారు. శుక్రవారం వేల మందికి పైగా భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు.

పునర్వికాసం

(1వ పేజీ తరువాయి)

బాధ్యత నేటి సమాజంపై ఉందని సూచిం చారు. ప్రజలు చెల్లించే ఆస్తి పన్నుల్లో 8 శాతం గ్రంథాలయ సెస్ కలిసి ఉంటుందని, ఆ నిధుల్ని గ్రంథాలయాల్లో కొత్త పుస్తకాలు,ఫర్నిచర్, నూతన సాంకేతిక గ్రంథాలయ వనరులను సమకూర్చ డానికి, గ్రంథాలయ సిబ్బందిని నియమించడానికి ప్రభుత్వం కృషి చేయాలని ఆయన కోరారు. వసతులు కల్పన, గ్రంథాలయ సిబ్బంది నియా మకం కొన్ని సంవత్సరాలుగా నిలిచిపోయిందని వెంటనే ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలని లక్ష్మీనారాయణ కోరారు. వేదిక రాష్ట్ర కన్వీనర్ వల్లూరు శివప్రసాద్, అరసం రాష్ట్ర కార్యదర్శి బొల్లినేని నాగార్జున సాగర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో చేపట్టిన సంస్కరణ ఉద్యమం, గ్రంథాలయ ఉద్యమం అందించిన స్ఫూర్తితో గ్రంథాలయ పునర్వికాస ఉద్యమం సాగించే కర్తవ్యం మన అందరిపై ఉందని ఆయన వివరించారు. ఈనెల 27 ఆదివారం విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ రాష్ట్ర సదస్సు జరుగుతుందని ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని కోరారు. అనంతరం నూతన కమిటీని ఎంపిక చేశారు కన్వీనర్‌గా ఎన్. పవన్ కుమార్, కో.కన్వీనర్‌గా జి. తాతారావు, సభ్యులుగా సి. అశోక్ ,పువ్వుల ఆనంద్, చిలుకూరి శ్రీనివాస్ భరద్వాజ్, దాసరి శివ, ఎస్ కే మీరా, జే వసంతరావు, పీవీ సంజీవ్‌రావు ఉన్నారు. కార్యక్ర మంలో జేవివి నాయకులు చల్లా రవికుమార్, బాలోత్సవ కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శి పి .తులసి ,సాహితీవేత్త ,అల్లూరి యువజన సంఘం నాయకులు లోలభట్టు శ్రీనివాసరాజు, సాహితీవేత్త బి.హెచ్ .రమాదేవి సీనియర్ న్యాయవాది తోరాటి వసంతరావు, కందికట్ల భీమయ్య, ఓబులేసు, పూర్ణిమ రాజు, భాస్కర్, రాంబాబు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ముందుకు రావాలి

(1వ పేజీ తరువాయి)

నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించిన పి-4 కార్యక్రమంలో భాగంగా సంపన్నులు సహకారం, భాగస్వామ్యంతో సమాజంలోని అట్టడుగు వర్గాల అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. వారి ఆశయాలకు అనుగుణంగా మనం అందరు కృషి చేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తణుకు పట్టణ సుందరీకరణ, పార్కుల అభివృద్ధిని గత నెలలో ముఖ్యమంత్రి తణుకు పర్యటన సందర్భంగా ప్రస్తావించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని పారిశ్రామికవేత్తలు, దాతలు, ఎన్ ఆర్ ఐ లు తమ వంతు సహకారం అందించి పట్టణ అభివృద్ధికి తోడ్పాటును అందించాలని కోరారు. ఇప్పటికే పట్టణంలో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ ను నిషేధించామన్నారు. తొలుత మున్సిపల్ కమిషనర్ టి.రామకుమార్ తణుకు మున్సిపల్ పరిధిలో అభివృద్ధి చేయనున్న రెడ్డి అండ్ రెడ్డి లేఅవుట్, శ్రీ కుమార్ లేఅవుట్ వన్, తేతలి వీరరాఘవులు రెడ్డి లేఅవుట్ ఓపెన్ స్పేస్, కరుటూరి రంగారావు నగర్ లేఅవుట్, 17వ వార్డు మాంటిసోరి స్కూల్ వద్ద, యూ పి హెచ్ సి బ్యాక్ సైడ్, పైడిపర్రు చెరువు, రజకుల చెరువు, అరుంధతీయుల చెరువు, జనగం చెరువు, తదితర ప్రాంతాల్లో చేపట్టబోయే పార్కుల అభివృద్ధి, ఓపెన్ జిమ్, గ్రీనరీ, వాకింగ్ ట్రాక్, ఫెన్సింగ్ వర్క్, పటిల్, బ్యాడ్మింటన్, కబాడీ కోర్ట్ లు ఏర్పాటు పనులు, వాటి అంచనా వ్యయంపై సమావేశంలో పవర్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో ఆంధ్ర షుగర్స్ జి.ఎం ఏ.సాంబశివరావు, అక్కమాంబ టెక్స్టైల్స్ లిమిటెడ్ ప్రతినిధులు ఎన్.కే మొహిద్దీన్, కే.రామకృష్ణ, ఎన్.కె మెరైన్స్ ప్రతినిధి వి.శ్రీనివాస్, జి.రాజేష్, దేవి సీఫుడ్స్ ప్రతినిధులు ఎన్.శివకుమార్, వై.కళ్యాణ్, ప్లటస్ టెక్ ల్యాబ్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు సిహెచ్ ఫణీంద్ర, ఎం.వెంకట్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

జవాబుదారీతనం

(1వ పేజీ తరువాయి)

వినియోగదారులకు సరఫరా చేసే ఇసుక ధర విషయంలో హేతుబద్ధత తప్పనిసరిగా కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఇసుక సరఫరా విధానం పై ఏజెన్సీస్ ప్రతినిధులతో జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్న రాముడు, ఆర్డీవోలు ఆర్. కృష్ణ నాయక్ , రాణి సుస్మిత , జిల్లా మైన్స్ అధికారి డి. ఫణి భూషణ్ రెడ్డి, ఆర్ డబ్ల్యు ఎస్ ఎస్ ఈ - బీవీ గిరి లతో కలిసి కలెక్టరు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రానున్న వర్షాకాలంను దృష్టిలో ఉంచుకొని ముందస్తుగా నిర్మాణాలకు ఎటువంటి ఆటంకం లేకుండా తీసుకునే చర్యలలో భాగంగా జిల్లాలో స్టాక్ యార్డులను గుర్తించి అక్కడ ఇసుక నిల్వలను ఏర్పాటు చెయ్యడం జరుగుతోందని తెలిపారు. ఇందు కోసం ప్రభుత్వం గుర్తించిన లేదా ఏజెన్సీస్ గుర్తించిన స్థలాలలో ఆయా స్టాక్ యార్డు లకు అనుమతి ఇవ్వనున్నట్టు తెలిపారు. ఏజెన్సీస్ స్వయంగా స్టాక్ యార్డులను నిర్వహించేందుకు ముందుకు వస్తే ఆమేరకు అనుమతి ఇవ్వనున్నట్టు తెలిపారు. రిజర్వు చేయబడిన ఇసుక నిర్దిష్ట సోర్స్ పాయింట్ వద్ద కార్యకలాపాల ఖర్చు ఆధారంగా జిల్లా స్థాయి ఇసుక కమిటీ ద్వారా బేస్ రేటును నిర్ణయిస్తుందని, అంతకంటే ఎక్కువ ధరకు వినియోగదారునికి ఇసుక సరఫరా చేయడం ఉల్లంఘన కింద పరిగణన లోనికి తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

రవాణా ఛార్జీలు నిర్ధారించే విషయంలో మధ్యస్థంగా ధర నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని వెల్లడించారు. ఫిర్యాదుల పరిష్కారం కోసం ఏజెన్సీస్ జవాబుదారీతనం కలిగి ఉండడం, అధికారులు అడిగే అంశాల పై తగిన వివరణ ఇవ్వడం తప్పనిసరి అన్నారు.

కాసులు

(1వ పేజీ తరువాయి)

ప్రాధాన్యత లేకుండా పోతుందన్న చర్చ తెరపైకి వచ్చింది.ఇప్పటికే అధిక శాతం కార్పొరేషన్లు,మునిసిపాలిటీలలో ప్రతిపక్షం పార్టీ వైసీపీ వర్గాలు అధికార పార్టీకి జై కొట్టడం,కూటమినేతలు మేయర్లు,ఛైర్మన్ గా ఎన్నుకోవడం జరిగింది.జరుగుతోంది. ఈ నేపథ్యంలో తాజాగా ప్రభుత్వం పురపాలక సంఘాలకు కార్పొరేషన్లకు వస్తున్న కొన్ని ఆదాయ వనరులను ఖర్చు చేసే అధికారం అధికారులకు అప్పగించడానికి నిర్ణయం తీసుకోనున్నట్లు వార్తలు గుప్పుమనడంతో అధికారపక్షంలోని కార్పొరేషన్, మున్సిపాలిటీ పాలకవర్గ నేతలలో తీవ్ర చర్చ జరుగుతోంది. ప్రభుత్వం ఇదే నిర్ణయం తీసుకుంటే దిగువ స్థాయి నేతల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కోక తప్పదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

అవార్డు గ్రహీత రాజర్షికి అభినందనలు

విశాలాంధ్ర-కామవరపుకోట: మహా మహాశివబట్టు వెంకట రాజర్షి రంగస్థల కళారంగానికి ఆయన చేసిన అత్యుత్తమ సేవలకు గుర్తింపుగా శ్రీకందుకూరి వీరేశలింగం పురస్కారానికి ఎంపికైన మహాశివ బట్టు వెంకట రాజర్షికి ఏపీ ప్రజానాట్యమండలి ఏలూరు జిల్లా సబ్ కమిటీ కన్వీనర్ టీఎస్ రాజు శుక్రవారం ఒక ప్రకటనలో కళాభివందనాలు తెలిపారు. అభ్యుదయ భావాలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించడంతోపాటు అభ్యుదయ రచనలపై ఆసక్తితో అభ్యుదయ రచనలను అధ్యయనం చేసి వాటిని కళారూపాలుగా రూపొందించి పలు ప్రదర్శనలు ఇచ్చి ఉత్తమ నటునిగా గుర్తింపు తన సొంతం చేసుకున్న రాజేష్‌కు ఏపీ ప్రజానాట్యమండలి సీనియర్ బుర్రకథ కళాకారుడు సబ్బి కనకారావు, ఏపీ జానపద కళాకారుల సంఘం అధ్యక్షుడు ఎల్ఆర్ కృష్ణబాబు, ప్రముఖ బుర్రకథ కళాకారుడు వీరమల్ల సత్యనారాయణ, బచ్చు నందకుమార్, వర్ధమాన సినీ నటుడు తిరుపతి రమేష్‌బాబు, కళాభిమానులు సాయన రాఘవమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కనకరాజు, సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ వీరమల్ల మధు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ షేక్ ఇబ్రహీం, భైరవపాటి ప్రసాద్ తదితరులు రాజేష్‌కు అభినందనలు తెలిపారు.

24 నుంచి మెడికల్ సర్టిఫికెట్లు పొందవచ్చు

విశాలాంధ్ర-ఏలూరు: స్థానిక జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ నెల 24, 25,26తేదీలలో ఉపాధ్యాయులు మెడికల్ సర్టిఫికెట్లను పొందవచ్చునని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం. వెంకట లక్ష్మమ్మ తెలిపారు. ఏపీ స్టేట్ టీచర్స్ ట్రాన్స్ఫర్ రెగ్యులేషన్ యాక్ట్ -2025 ప్రకారం మెడికల్ సర్టిఫికెట్ ద్వారా ప్రిఫరెన్షియల్ క్యాటగిరి,స్పెషల్ పాయింట్స్ పొందేందుకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని అర్హులైన ఉపాధ్యాయులు అనారోగ్య సంబంధిత సర్టిఫికెట్లను చూపించి నూతన మెడికల్ సర్టిఫికెట్ వైద్య ఆరోగ్యశాఖ అధికారుల వద్ద నుంచి తీసుకోవాలని డీఈఓ కోరారు. పూర్వపు పశ్చిమగోదావరి జిల్లా పాఠశాల విద్యాశాఖ పరిధిలోని ప్రభుత్వ,జిల్లా పరిషత్,మండల పరిషత్, మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీ పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రిఫర్ రెన్షియల్ క్యాటగిరి ఉపాధ్యాయులు త్వరలో జరగనున్న బదిలీల్లో తాజా మెడికల్ సర్టిఫికెట్లను ఏలూరు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి లోని వైద్యుల నుంచి తీసుకున్న ధ్రువీకరణ పత్రాలను పొందుపరచాల్సి ఉంటుందని డిఇఓ వెంకట లక్ష్మమ్మ తెలిపారు.

ఘనంగా రాష్ట్ర సమాచార శాఖామంత్రి కొలుసు పార్థసారథి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర- నూజివీడు: రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖామంత్రి కొలుసు పార్థసారథి జన్మదిన వేడుకలు

నూజివీడులో శుక్రవారం ఘనంగా జరిగాయి. నూజివీడు పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో నియోజకవర్గ అభిమానులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు, పార్టీ కార్యకర్తలు పెద్దఎత్తున హాజరై మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి రామకృష్ణ, నూజివీడు ఏఎంసీ మాజీ చైర్మన్ కాపా శ్రీనివాస రావు వివిధ శాఖల ఉద్యోగులు, పార్టీ కార్య కర్తలు పూల గుచ్చాలు అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు. అంతకు ముందు వేద పండితులు మంత్రికి వేద మంత్రాలతో వేదఆశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా భారీ కేకును కోసి ప్రజలకు పంచిపెట్టారు. నూజివీడు నియోజకవర్గ అభిమానులు భారీ గజమాలతో మంత్రి పార్థసారథిని సత్కరించారు.

నూతన విద్యా విధానంతో గందరగోళం-ఏపీటీఎఫ్

విశాలాంధ్ర -భీమవరం: విద్యాశాఖ ప్రవేశపెడుతున్న నూతన విధానాలు గందరగోళంగా ఉన్నాయని, విద్యా రంగానికి మేలు చేసే విధంగా లేవని జీవో నెంబర్ 117 ను పూర్తిగా రద్దుచేసి 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలల నుండి వెనక్కు తీసుకురావాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ప్రకాశం, ప్రధాన కార్యదర్శి బి.వి.నారాయణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల స్వరూపాన్ని మార్చడం సరైన విధానం కాదని విమర్శించారు. గత ప్రభుత్వం ఉన్నత పాఠశాలల్లో కలిపిన మూడు నాలుగు ఐదు తరగతులను తిరిగి ప్రాథమిక పాఠశాలకు పంపాలని ఉపాధ్యాయులు కోరుతుంటే విద్యాశాఖ రాబోయే విద్యా సంవత్సరం నుండి 1557 పాఠశాలలలో ఒకటి రెండు తరగతులను కూడా కలిపి ఒకటి నుండి పది తరగతుల వరకు కొనసాగించాలని నిర్ణయించడం సరైనది కాదని వారు మండిపడ్డారు.

శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న మంత్రి పార్థసారధి

విశాలాంధ్ర - అగిరిపల్లి: రాష్ట్ర గృహ నిర్మాణ సమాచార పౌర సంబంధాల శాఖామంత్రి కొలుసు పార్థసారధి తన జన్మ దినోత్సవం సందర్భంగా ఆగిరిపల్లి లోని శ్రీ వ్యాఘ్ర లక్ష్మీ నరసింహ స్వామి వారిని శుక్రవారం దర్శించు కున్నారు.

మంత్రి పార్థసారథికి దేవాలయ ప్రధాన అర్చకులు, దేవాలయ ట్రస్ట్ చైర్మన్ ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అంతరాలయంలో మంత్రి పార్థసారథికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేదాశీర్వచనం చేశారు. ఆలయ అర్చకులు స్వామి వారి తీర్థప్రసాదాలతో పాటు స్వామి వారి చిత్రపటాన్ని మంత్రికి బహూకరించారు. అనంతరం ఆగిరిపల్లిలో భారీ కేకును కట్ చేసి అభిమానులను పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఆగిరిపల్లి లోని ప్రముఖులు, వివిధ శాఖల అధికారులు, ప్రజలు, అభిమానులు, పార్టీ కార్యకర్తలను మంత్రి పార్థసారథికి పుష్పగుచ్ఛాలు అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు.

3వ అదనపు జిల్లా జడ్జి బదిలీ

విశాలాంధ్ర -భీమవరం: భీమవరం 3వ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్ ఎం.ఎ.సోమ శేఖర్ నెల్లూరు 8వ అదనపు జిల్లా జడ్జి, మహిళా కేసుల నేర విచారణ ప్రత్యేక కోర్టుకు బదిలీ అయ్యారు. ఆయన తన బాధ్యతలను భీమవరం ఫోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి బి.లక్ష్మి నారా యణకు అప్పగించాల్సిందిగా హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది.

వైభవంగా సర్వోదయ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర- ఉంగుటూరు : గాంధీజీ ఆదర్శాలు, సమతా భావం, జాతీయ దృక్పథాన్ని, దేశ ఐక్యతకు స్ఫూర్తి చిహ్నంగా 65వ సర్వోదయ ఆవిర్భావ దినోత్సవం పండుగ వాతావరణంగా జరుపుకుంటున్నామని పలువురు వక్తలు పేర్కొన్నారు.

ఉంగుటూరు మండలం నాచుగుంట సర్వోదయ స్థూపం వద్ద శుక్రవారం 13వ అఖిలభారత సర్వోదయ సమ్మేళనం సందర్భంగా 65వ సర్వోదయ ఆవిర్భావ దినోత్సవం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సర్వోదయం సమ్మేళనం గురించి అప్పటి జ్ఞాపకాలను వక్తలు గుర్తుకు తెచ్చుకున్నారు. దేశ చరిత్రలో సర్వోదయ సమ్మేళనం మంచి గుర్తింపు పొందిందన్నారు. జిల్లా సర్వోదయ మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాద రాజు ఆధ్వర్యంలో సర్వోదయ స్థూపం వద్ద శాంతి ప్రతిజ్ఞ చేశారు. సర్వమత ప్రార్థనలు, శాంతి ప్రార్తనలు, సేవా తత్పరులగు చర్ల విదుల కుమారి, బోయపాటి రామ లక్ష్మి లకు సర్వోదయ స్ఫూర్తి పురస్కారాల అందజేసి సన్మానం చేశారు. సర్వోదయ యువవాహినీ కార్యక్రమాలు ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో సర్వోదయ జల్ల అధ్యక్షురాలు చర్ల విధుల కుమారి, కార్యదర్శి ఇందుకూరి రామకృష్ణం రాజు, ఉంగుటూరు ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, గ్రామ సర్పంచి బండారు సింధు, కొండ్రెడ్డి సర్వేశ్వరరావు,సర్వోదయ నాయకుడు సాగిరాజు జానకిరామరాజు, జల్లా వీరభద్రరావు, బొడ్డేపల్లి అప్పారావు, బోయపాటి రామలక్ష్మి, ఆర్ వి ఎస్ రాజు, గట్టి మాణిక్యాలరావు, అడపా శోభారాణి, అల్లాడ సత్యనారాయణ, పుప్పాల గోపి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర -భీమవరం: గొల్లవానితిప్ప విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో చెట్లు, చెట్టు కొమ్మలు తొలగించుట, లైన్ల మరమ్మతుల నిమిత్తము శనివారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈ.ఈ ఎన్. వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్.వి.ఎన్.పురం, సి.ఎ.డి.కంపెనీ, పల్లిపాలెం, ఈలంపూడి గ్రామాలతో పాటు ఆక్వా చెరువుల లైన్లకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

భక్తి శ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే

విశాలాంధ్ర- లింగపాలెం: ఓదేవా, ఓదేవా నా చేతిని ఎందుకు విడిచితివి అంటూ సిలువలో ఏసుక్రీస్తు అన్న మాటలను ఉదహరిస్తూ మంచి శుక్రవారాన్ని పురస్కరించుకొని చర్చిలలో క్రైస్తవ బోధకులు బోధనలు చేశారు. లింగపాలెం మండలంలోని అన్ని గ్రామాలలో క్రైస్తవులు మంచి శుక్రవారాన్ని భక్తిశ్రద్ధలతో జరిపారు. ధర్మాజీగూడెం, లింగపాలెం, అయ్యపరాజుగూడెంలను కేంద్రంగా చేసుకొని ఈ పరిసర గ్రామాలలో ఉన్న ఆర్.సి.ఎం మత విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని సిలువ మార్గాన్ని నిర్వహించారు. సిలువలో ఏసుక్రీస్తు పలికిన ఏడు మాటలను ఉదాహరిస్తూ బోధకులు ప్రసంగాలు చేశారు.క్రీస్తు సిలువ మరణం మానవాళికి మార్గదర్శకమని తెలిపారు. ఈసందర్భంగా మాలలు ధరించి ప్రత్యేక ప్రార్థనలు చేసిన విశ్వాసులు గుడ్ ఫ్రైడేని పురస్కరించుకొని మాలలను తొలగించారు. అనేకమంది విశ్వాసులు క్రైస్తవ పుణ్యక్షేత్రాలకు తరలి వెళ్లారు. విశ్వాసులంతా చర్చిలలో ఉపవాస ప్రార్థనలలో నిమగ్నమయ్యారు.

క్రైస్తవులకు ముస్లింల సంఘీభావం

గుడ్‌ఫ్రైడే సందర్భంగా సిలువ ఊరేగింపు చేస్తున్న క్రైస్తవ

విశ్వాసులకు ముస్లిం సోదరులు సంఘీభావాన్ని తెలిపారు. ధర్మాజీగూడెంలో ఎండలో సిలువ ఊరేగింపు చేస్తున్న క్రైస్తవులకు ముస్లిం సోదరులు మజ్జిగ, మంచి నీళ్లు పంపిణీ చేసి సిలువ మార్గం చేస్తున్న విశ్వాసులకు సంఘీభావం తెలిపారు.

కొయ్యలగూడెం: ప్రేమ, కరుణ, శాంతికి ప్రతి రూపం ప్రభువైన యేసుక్రీస్తు అని గవరవరం ఆర్‌సిఎం చర్చి విచారణ గురువులు ఆనంద్ భాస్కర్ తెలిపారు. గుడ్

ఫ్రైడే సందర్భంగా మండలంలో అంకలగూడెం గ్రామం నుండి క్రైస్తవ సోదరులు సిలువ మార్గాన్ని, కొయ్యల గూడెం పట్టణం మీదుగా గవరవరం ఆర్ సి ఎం చర్చి వరకు నిర్వహించారు. విచారణ గురువులు ఆనంద్ భాస్కర్ మాట్లాడుతూ ప్రభువైన యేసుక్రీస్తు మానవులను పాపాలను నుండి రక్షించడం కోసం సిలువ వేయబడ్డారని అన్నారు. ఈ కార్యక్రమంలో సహాయక గురువులు అరుణ్, ఉపదేశకులు అనిల్, సింగ్, జేసుదాసు, ఏసోబు, విశ్వాసులు పాల్గొన్నారు.

భీమడోలు: ప్రజలందరూ క్రీస్తు మార్గంలో నడవాలని

పాస్టర్ రోజెస్ పేర్కొన్నారు. కోడూరుపాడు షారోను ప్రార్థన మందిరంలో శుక్రవారం గుడ్ ఫ్రైడే యేసుక్రీస్తు సర్వమానవాళి కోసం శిలువపై మరణించిన రోజుగా గుర్తించి మండలంలో పలు చర్చిల్లో గుడ్‌ఫ్రైడే నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని రెవరెండ్ పాస్టర్ రోజెస్ ప్రసంగిస్తూ క్రీస్తు మార్గంలో ప్రతి ఒక్కరు నడుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు సంఘస్తులు స్తుతి ఆరాధనలో నిర్వహించారు.

పాలకోడేరు : గుడ్ ఫ్రైడే పర్వదినాన్ని పురస్కరించుకుని పాలకోడేరు మండలం శృంగ వృక్షం గ్రామంలో గల విచారణ ఆర్ సి ఎం చర్చి సంఘస్తులు చర్చి ఫాదర్

రెవరెండ్ తోట గాబ్రియల్ ఆధ్వర్యంలో శృంగవృక్షం హై స్కూల్ నుండి ఆర్.సి.యం చర్చి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జంగం సూరిబాబు, వివిధ క్రైస్తవ సంఘ కాపరులు, సంఘ విశ్వాసులు, గ్రామస్తులు పాల్గొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని చర్చిలలో సంఘ విశ్వాసులు ఉదయం నుండి ప్రత్యేక ఉపవాస ప్రార్థనలలో పాల్గొన్నారు.

గణపవరం: గుడ్ ఫ్రైడే సందర్భంగా గణపవరం గ్రామంలో మరనాత స్వస్థలం (నూతన చర్చి)లో బైబిల్ మిషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రత్యేక ప్రార్థనలో శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచానికి శాంతి సందేశాన్నిస్తూ జీసస్ చేసిన మహాత్యాగానికి ప్రతీక గుడ్ ఫ్రైడే అన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేస్తూ గుడ్ ఫ్రైడే రోజున

పాస్టర్లకు ఏడు నెలల గౌరవ వేతనం ఒకేసారి విడుదల చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బైబిల్ మిషన్ పాస్టర్ రెవ"అద్దంకి జాన్ పీటర్ అయ్యా, ఉంగుటూరు ఏఎంసీ చైర్మన్, మండల జనసేన తోట శ్రీను, టిడిపి, బిజెపి అధ్యక్షులు, గ్రామ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజా ప్రతినిధులు, పాస్టర్లు, విశ్వాసులు తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు :నియోజకవర్గంలోని గ్రామాల్లో గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. అన్ని గ్రామాల్లో

క్రైస్తవ భక్తులు సిలువను మోస్తూ ప్రదర్శన నిర్వహించారు. నూజివీడు పట్టణంలో రాజీవ్ సర్కిల్ వద్ద నుండి పట్టణ పురవీధుల్లో సిలువ మార్గం ప్రదర్శన నిర్వహించారు.ప్రజల రక్షణ కోసం ప్రభువైన యేసుక్రీస్తు పడిన శ్రమలు, మరణానికి ప్రతీక గా గుడ్ ఫ్రైడే నిర్వహిస్తారని క్రైస్తవ పెద్దలు సందేశం ఇచ్చారు.

టి నరసాపురం: శాంతియుత సమాజం కోసం క్రీస్తు బోధనలు అనుసరణీయమని క్రైస్తవ మత ప్రబోధకులు ప్రబోధించారు. క్రైస్తవుల పర్వదినమైన గుడ్ ఫ్రైడేని మండలంలోని అన్ని ప్రార్థన మందిరాల్లో భక్తి శ్రద్ధలతో

శుక్రవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా యేసు క్రీస్తు శిలువ వేయబడిన సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ మండలంలోని ప్రకాష్ నగర్, పుట్రేపు, రుద్రకోటరాజు గూడెం, గండి గూడెం, మర్రి గూడెం, టి నరసాపురం, బొర్రంపాలెం, తెడ్లెం తదితర గ్రామాల్లో క్రైస్తవులు, పాస్టర్లు శిలువమార్గాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యేసుక్రీస్తు వలే శిలువ మోసి ,ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమాల్లో పాస్టర్లు జి. జ్ఞాన్ రాజు, కె నిరీక్షణరావు, సిహెచ్ హెూషేయలు, కె. పాల్ చిన్నారావు, సిహెచ్ రమేష్, టి. ప్రసన్నకుమార్, అకుల ప్రసన్నరాజు, జాన్ మీకా, తీతు తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి: మత సామరస్యానికి ప్రతీకగా ముస్లింలు క్రైస్తవులకు బాసటగా నిలవడం అభినందనీయం అని చింతలపూడి సిఐ రాజశేఖర్ అన్నారు.శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా చింతలపూడిలో ఆర్ సి యం చర్చి

ఫాదర్ మ్యాత్యు అధ్వర్యంలో మత విశ్వాసకులు ప్రార్థనలు చేస్తూ ముందుకు సాగారు. ఈ ర్యాలీలో ఫాదర్ మ్యాత్యు తదితరులు ప్రభు సిలువ ను మోస్తూ యేసు త్యాగాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్ష , కార్యదర్శులు సయ్యద్ రహీమ్,ఎండీ జిలానీ,జమాత్ ఇస్లామీ హింద్ పెద్దలు ఎండీ అక్బర్ అలి,తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం,సుదూర గ్రామాల్లో పలుచోట్ల భక్తిశ్రద్ధలతో పరిశుద్ధ వారంలో భాగంగా మంచి శుక్రవారం క్రైస్తవ సోదరులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. దీనిలో భాగంగా తాడువాయిలో భేతేస్థ స్వస్థతశాలలో పాస్టర్ రె.వ వి

జయానందరాజు ఆధ్వర్యంలో పాస్టర్ దేవాకాంత్ విశ్వాసులకు వాక్యోపదేశం చేశారు. అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు. వచ్చిన విశ్వాసులకు ప్రేమ విందు ఏర్పాటు చేశారు. జంగారెడ్డిగూడెంలో ఆర్సీఎం చర్చి విచారణ గురువు ఫాదర్ కే.కళ్యాణ్ కుమార్ ఆధ్వర్యంలో బహిరంగ సిలువ మార్గం నిర్వహించారు.అన్ని గ్రామాల నుంచి కతోలిక విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. క్రీస్తు సిలువపై మరణానికి ముందు పడిన పాటులను స్మరిస్తూ 14 స్థలాల్లో బహిరంగ సిలువ మార్గం చేపట్టారు.రె.వ ఫాదర్ బాలస్వామి వాక్యోపదేశం చేశారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి ఆర్.సి.యం చర్చి ప్రాంగణం వరకు భారీగా బహిరంగ సిలువ మార్గం నిర్వహించారు.విచారణ గురువులు రె.వ ఫాదర్ కళ్యాణ్ కుమార్ సిలువను ఎత్తుకుని ర్యాలీ అగ్రభాగాన నిలిచారు.ఈ కార్యక్రమంలో నిర్మలా కాన్వెంట్ సుపీరియర్ సిస్టర్ అమలారాణి,కన్య స్త్రీలు,ఉపదేశులు,సంఘ పెద్దలు,కతోలిక విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చారిత్రాత్మకం

ఎమ్మెల్యే బడేటి స్పష్టీకరణ

విశాలాంధ్ర- ఏలూరు : ఎస్సీ వర్గీకరణ అంశం ఎంతో చారిత్రాత్మకమైందని, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అసెంబ్లీలో వర్గీకరణ బిల్లుకు ఆమోదం తెలిపి ఆర్డినెన్స్ జారీ చేసి వర్గీకరణ అమలు చేయడం శుభ పరిణామమని ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య చెప్పారు. ఏలూరు జిల్లా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బడేటి చంటిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎస్సీ వర్గీకరణకు ఆర్డినెన్సు తీసుకురావడం వల్ల ఎస్సీ ఉపకులాల అభివృద్ధికి బాటలు వేసినట్లు అయ్యిందని ఎమ్మార్పీఎస్ నాయకులు చెప్పారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఎమ్మార్పీఎస్ సీనియర్ రాష్ట్ర నాయకులు బయ్యారపు రాజేశ్వరరావు, జింజు మోజెస్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాశీకృష్ణ, ఎంఎస్పి రాష్ట్ర నాయకులు బసపర్తి మాధవరావు, ఎంఎస్పి జిల్లా నాయకులు చాట్ల సాయిబాబా, తోటకూర రవి, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు బయ్యారపు కుటుంబరావు, ఎంఎస్పి ఏలూరు నాయకులు పరసా చిన్నబాబులు ఉన్నారు.

చింతలపూడి నగర పంచాయతీ కమిషనర్‌గా అంబటి రాంబాబు

విశాలాంధ్ర- చింతలపూడి: చింతలపూడి నగర పంచాయతీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని నగర పంచాయతీ కమిషనర్ అంబటి రాంబాబు అన్నారు. నగర పంచాయతీ కమిషనర్‌గా అంబటి రాంబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరిం చారు. జగ్గయ్యపేట మున్సిపాలి టీలో పనిచేస్తూ పదోన్నతిపై చింతలపూడిలో నగర పంచాయతీ కమిషనర్‌గా పదవి బాధ్యతలు స్వీకరించినట్టు తెలిపారు. గతంలో పనిచేసిన కమిషనర్ పావని అనంతపురం బదిలీ అయ్యారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతలపూడి నగర పంచాయతీని స్వచ్ఛ నగర పంచాయతీగా తీర్చిదిద్దుతానని ఆయన అన్నారు.

పోలీస్ స్టేషన్‌కు ఏసీ అందజేత

విశాలాంధ్ర-వీరవాసరం: సమాజానికి ఉపయోగపడే విధంగా ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలని లయన్స్ క్లబ్ డిస్టిక్ పిఆర్ఓ, క్రెడాయ్ ఉపాధ్యక్షులు కొత్తపల్లి రాంబాబు తెలిపారు. వీరవాసరం పోలీస్ స్టేషన్‌కు మండలంలోని నడపన వారి పాలెంకు చెందిన కొత్తపల్లి రాంబాబు రూ. 55 వేల రూపాయల విలువైన ఎయిర్ కడిషనర్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజల కోసం బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి సమాజంలోని ప్రతి ఒక్కరు రుణపడి ఉండాలన్నారు. ఏసీని బహూకరించిన కొత్తపల్లి రాంబాబును ఎస్ఐ రాజ్‌కుమార్, పోలీస్ సిబ్బంది అభినందించారు.

వినతి (1వ పేజీ తరువాయి)

నివేదిక అందించినట్లు మేయర్ చెప్పారు. ఏలూరు నగర పాలక సంస్థలో కలిసిన 7 పంచాయతీలకు పూర్తి సామర్థ్యంతో మంచినీటిని అందించడానికి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు మరియు పైప్ లైన్లు ఏర్పాటుకు 24.56 కోట్ల రూపాయలు అవసరం అవుతాయని అంచనాలు ఇచ్చామన్నారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు అమలు చేయడానికి 15 ఎంఎల్డి సామర్థ్యం గల చెరువును నిర్మించేందుకు సుమారుగా రూ.119 కోట్ల రూపాయలు ఖర్చవుతాయని వివరించామన్నారు. నగరపాలక సంస్థ మరియు 7 విలీన పంచాయతీల్లో 48 కిలోమీటర్ల కొత్త రోడ్లు, 95 కిలోమీటర్ల రోడ్ల మరమ్మత్తుల నిమిత్తం 474.10 కోట్ల రూపాయల అంచనాలు రూపొందించినట్లు చెప్పారు.

వక్ఫ్ భూముల సవరణ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలి

విశాలాంధ్ర- నూజివీడు టౌన్: కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు ద్వారా తీసుకువచ్చిన వక్ఫ్ భూముల సవరణ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం నూజివీడు పెద్ద మజీద్ వద్ద నుండి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు పలు ముస్లిం సంఘాలు, నాయకులు, సిపిఐ, సిపిఎం కార్యకర్తలు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఆయా కూడళ్లలో మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. మండు టెండలో ర్యాలీ నిర్వహిస్తూ హిందూ, ముస్లిం, క్రిస్టియన్, భాయ్ భాయ్, రాజ్యాంగాన్ని రక్షించాలి అంటూ నినాదాలు చేశారు. ప్రదర్శకులు జాతీయ జెండాలను, నల్లజెండాలను ప్రదర్శించారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు మాట్లాడుతూ గత 11 ఏళ్లుగా అధికారం చేపట్టిన ప్రభుత్వం హిందూ, ముస్లింల మధ్య విద్వేషాలు సృష్టించడానికి ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. రాజకీయ ప్రయోజనాల కోసం బిజెపి మత ఉద్రిక్తతలను రెచ్చగొడుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి. రాజు, సిపిఐ పట్టణ కార్యదర్శి చాట్ల పుల్లారావు, ఎన్ఆర్ హనుమాన్లు, ముస్లిం సంఘాల పెద్దలు, నాయకులు గబ్బర్, అబ్దుల్ హక్, తదితరులు పాల్గొన్నారు.

నవయుగ వైతాళికులను విస్మరించడం బాధాకరం

విశాలాంధ్ర-ఏలూరు: 2025 ఏడాదిలో ప్రముఖుల జయంతుల్ని, వర్ధంతుల్ని ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలుగా నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇటీవల జారీ చేసింది. ఈ జాబితాలో ప్రముఖ తెలుగు నవయుగ వైతాళికులు, సంఘ సంస్కర్తలు,విజ్ఞాన వేత్తలు,దేశభక్తుల పేర్లను ప్రభుత్వం విస్మరించడం బాధాకరమైన విషయమని,దీనిని జిల్లా రచయితల సంఘం ఖండిస్తున్నదని డాక్టర్ లంకా వెంకటేశ్వర్లు, నాగాస్త్ర,లేళ్ళ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.తెలుగులో తొలివచన కావ్యం కన్యాశుల్కం రచించిన గురజాడ వెంకట అప్పారావు, తొలి ఆధునికుడు కందుకూరి వీరేశలింగం, మహాకవి శ్రీ శ్రీ, నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా,గ్రంథాలయ ఉద్యమ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య, తెలుగు వ్యవహారిక భాషా ఉద్యమకారుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు,అద్భుత ఔషధ మాంత్రికుడు డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు,భారత జాతీయ జెండా నిర్మాత పింగళి వెంకయ్య,గాన గంధర్వుడు ఘంటసాల వెంకటేశ్వరరావు మొదలగు వారి పేర్లను ప్రభుత్వ అధికారిక జాబితాలో చేర్చాలని అన్నారు. నేడు ఇంత విజ్ఞానాన్ని సాధించి మనుగడ సాగిస్తున్నామంటే దానికి ప్రధాన కారణం అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడేలా ప్రధాన స్రవంతిని నిర్మించిన వారి విషయంలో ప్రాంతం, మతము, భాష, కులము లాంటి ఎలాంటి పరిమితులు పరిగణలోనికి తీసుకోకూడదని తెలిపారు. ఈ మహనీయులు చేసిన త్యాగాలను రేపటి తరానికి తెలియజేయడానికి పాఠ్యాంశా లలో వారి జీవిత చరిత్రలను చేర్చాలని పేర్కొన్నారు.ఈ విషయంలో ప్రభుత్వ సాంస్కృతిక శాఖ వైఫల్యం కొట్ట వచ్చినట్టు కనబడుతుందని విమర్శించారు. రాష్ట్రంలోని ప్రధాన సాహిత్య,కళా రంగాలు, సామాజిక,ప్రజా సంఘాలును, ప్రభుత్వ సాంస్కృతిక శాఖ సంప్రదించి ప్రముఖుల జయంతులను, వర్ధంతులను ప్రభుత్వం అధికారికంగా చేసే ఈ జాబితాను సవరించి,తిరిగి విడుదల చేయాలని కోరారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

విశాలాంధ్ర-జీలుగుమిల్లి : బడుగు, బలహీన వర్గాల వారిని కష్ట సమయాలలో ఆదుకోవడానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉంటుందని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. శుక్రవారం బర్రింకలపాడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13 మందికి గాను సుమారు 20 లక్షల రూపాయలు చెక్కులు బాధితులకు అందజేశామన్నారు. ప్రతి ఒక్కరు సుఖ సంతోషాలతో ఉండాలని ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. నియోజకవర్గంలోని ఇప్పటివరకు సీఎం సహాయ నిధి వంద మందికి ఇచ్చినట్టు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌కు నియోజకవర్గ తరపున అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీలుగుమిల్లి మండల జనసేన పార్టీ అధ్యక్షులు పసుపులేటి రాము, నియోజకవర్గ కూటమి నాయకులు పాల్గొన్నారు.

పేదోడికి అధికార పీఠం దక్కడమే పవన్ కళ్యాణ్ లక్ష్యం

రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: ప్రతి పేదోడికి అధికార ఫలాలు దక్కడమే జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లక్ష్యమని రాష్ట్ర పర్యాటక శాఖ, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలో ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ నివాసం వద్ద పెంటపాడు మండలం నుంచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో గెలిచిన ఎంపీటీసీలు జనసేన పార్టీలో చేరిక సందర్భంగా శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి పార్టీలైన జనసేన టిడిపి బిజెపి పార్టీల్లో నూతనంగా వచ్చే నాయకుల చేరిక కూటమి బలోపేతం కోసమే అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ఫలితంగా ప్రతిపక్ష పార్టీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి భారీగా నాయకులు వచ్చి చేరుతున్నారని ఇది కూటమి పాలన నిబద్ధతకు నిదర్శనం అన్నారు. ప్రభుత్వ విప్ తాడేపల్లి గూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇటీవల జువ్వలపాలెం రోడ్డు, ముత్యాలమ్మ గుడి కి వెళ్లే రోడ్డు,పెద్ద తాడేపల్లి నుంచి జగ్గంపేట వెళ్లే రోడ్ల కోసం రూ.20 కోట్లు నిధులు తీసుకొచ్చామని ఆ పనులు శరవేగంగా జరుగుతాయని తెలిపారు. తాడేపల్లిగూడెం, ఉంగుటూరు, నిడదవోలు నియోజకవర్గం మూడు నియోజకవర్గాల్లో కూడా అభివృద్ధి సంపూర్ణంగా జరిగేందుకు తాను సహకరిస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పెంటపాడు మండలం జనసేన పార్టీ అధ్యక్షుడు పుల్ల బాబి, మైలవరపు పెదబాబు, మైలవరపు రాజేంద్రప్రసాద్,కసిరెడ్డి మధులత, కొనగల హరినాథ్, చెరుకూరి జగత్ సోమ శేఖర్, చామన సురేష్, లక్ష్మణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దమయపర్తి మురుగు డ్రైన్ పనులు పూర్తి చేసే బాధ్యత నాది

మంత్రి నిమ్మల రామానాయుడు

విశాలాంధ్ర - పాలకొల్లు: పాలకొల్లు పట్టణంలో రూ. 14 కోట్లతో దమయ్యపర్తి మురుగు డ్రైన్ పనులకు ఎన్నికల ముందు మాటిచ్చానని, నేడు నెరవేర్చే దిశగా పనులు జరుగుతున్నాయని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. శుక్రవారం మంత్రి రామానాయుడు స్వయంగా దమయపర్తి కోడు పనులను పరిశీలించారు. సంబంధిత శాఖ ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ పట్టణంలో సుమారు 15 వార్డులు, వర్షాకాలంలో తీవ్ర ముంపుకు గురవుతున్నాయని, ఆయా ప్రాంతాల ప్రజలు అనుభవిస్తున్న అవస్థలను స్వయంగా తాను చూడడం జరిగిందని అన్నారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు గత టిడిపి ప్రభుత్వంలో నిధులు తీసుకువచ్చి పనులు మొదలు పెట్టించానని, అడుగడుగునా వైసిపి నాయకులు అడ్డు తగిలారన్నారు. ఆ తర్వాత వైసిపి అధికారంలోకి వచ్చిన పిదప, రూపాయి పని జరగకపోగా, టిడిపి ప్రభుత్వంలో మంజూరైన నిధులు సైతం రద్దు అయ్యాయన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం మళ్లీ పనులు చేపట్టేలా నిధులు తీసుకువచ్చానన్నారు. మూడు ప్రాంతాల్లో జరిగే పనులను ఎప్పటికప్పుడు కూటమి నాయకులతో కలిసి పర్యవేక్షిస్తూ వేగవంతంగా జరిగేలా దృష్టి సారిస్తానన్నారు. ముఖ్య టిడిపి నాయకులు అధికారులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌లను గ్రామస్థాయి ఉద్యోగులుగా గుర్తించాలి

విశాలాంధ్ర – ఆలమూరు : ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌లను గ్రామ స్థాయి ఉద్యోగులుగా గుర్తించాలంటూ ఎంపీడీవో ఏ రాజుకు మండల పరిషత్ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడిచిన 19 ఏళ్లుగా గ్రామాలలో ఫీల్డ్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న తమను గ్రామపంచాయతీ సిబ్బందిగా క్రమబద్ధీకరించాలన్నారు. మండలం యూనిట్‌గా తీసుకుని అంతర్గత బదిలీలు చేపట్టడం ద్వారా స్థానిక ఒత్తిడిలను అధిగమించి మరింత సమర్థవంతంగా పనిచేసేందుకు వీలు కల్పించాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు ఎఫ్‌టిఈ ఇచ్చి పూర్తిస్థాయి హెచ్‌ఆర్ పాలసీ, హెల్త్ కార్డు, ప్రమాద బీమా, గ్రాట్యుటీ వంటి సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నారు. విధి నిర్వహణలో మరణించిన ఫీల్డ్ అసిస్టెంట్‌ల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు అవకాశం ఇవ్వడంతో పాటు, రూ.10 లక్షల నష్టపరిహారం అందించాలన్నారు. విద్యా అర్హతల ఆధారంగా కంప్యూటర్ ఆపరేటర్లుగా, టెక్నికల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించాలని వారు కోరారు. పై డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీవోకు అందజేశామని ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిధి ఫీల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో విలేజ్ విజిట్స్ ఎక్కువగా చేయాలి: ఎస్పీ

విశాలాంధ్ర – కాకినాడ : కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఐపిఎస్ గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ విలేజ్ విజిట్స్ ఎక్కువగా చేయాలని ఆదేశాలు జారీ చేసిన మిగతా ఆదేశాలు జారీ చేయడం జరిగింది. దాంట్లో భాగంగా శుక్రవారం జగ్గంపేట మండలం కాట్రావులపల్లి గ్రామంలో అన్ని వర్గాల, పార్టీల కులాల పెద్దలు మరియు గ్రామ ప్రముఖులతో కాట్రావులపల్లి గ్రామపంచాయతీ వద్ద గ్రామ సభను నిర్వహించడం జరిగింది. ఈ గ్రామ సభలో గ్రామంలో ఎటువంటి క్రికెట్ బెట్టింగులు, జూద క్రీడలు లేకుండా చూడాలని, గంజాయి మత్తుకు యువత ఎవరు బానిసలు కాకుండా చూడాలని, మహిళలు, బాలికల రక్షణ విషయంలో ప్రతి ఒక్కరు సహకరించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్స్ ధరించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని, గ్రామంలో యువతను పెడ దోవపెట్టకుండా పెద్దలు అందరూ ఎవరి యువతను వారు సక్రమంగా క్రమ శిక్షణతో ఉండేలా చూసుకోవాలని, ఏదైనా అసాంఘిక కార్యక్రమాల సమాచారం ఉంటే వెంటనే CI YRK 9440796529, SI 9440796569 లేదా 100కు తెలియజేయాలన్నారు. జూద రహిత, గంజాయి రహిత, స్త్రీల మీద నేర రహిత మరియు ఎటువంటి గొడవలు లేని కాట్రావులపల్లి గ్రామంలో ప్రశాంత వాతావరణానికి అన్ని వర్గాల పెద్దలు సహకరించాలని గ్రామ సభను కోరడం జరిగింది. ఈ సభకు ఈ సభలో జగ్గంపేట రఘునందన్ రావు, సర్పంచ్ సుగుణ రావు మరియు క్రైమ్ మినిస్టర్ మరియు గ్రామంలో గంజాయి నివారణ మత్తు పదార్థాలు మత్తు పానీయాలు నివారణ మరియు శాంతి భద్రతలకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పెద్దలు చేయవలసిన చర్యల గురించి చర్చించడం జరిగింది. ఈ సభలో సీఐ వైఆర్‌కే, జగ్గంపేట ఎస్సై రఘునందన్ రావు, సర్పంచ్ సుగుణ రావు, సీతారామయ్య, ఎంపీటీసీ సత్తిబాబు, జనసేన సుంకర శ్రీను, వైస్ సర్పంచ్ రాంబాబు. అన్ని కులాల వర్గాల పెద్దలు హాజరు అవ్వడం జరిగింది.

నేడు స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర : కలెక్టర్

విశాలాంధ్ర – తూర్పుగోదావరి : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి నెలా మూడోవ శనివారం "స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమం నిర్వహించుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలియ చేశారు. స్వచ్ఛ ఆంధ్రా స్వర్ణ ఆంధ్రా కార్యక్రమం ప్రతి నెలా ఒక భావన (కాన్సెప్ట్) తో నిర్వహిస్తున్నట్లు, అందులో భాగంగా ఏప్రియల్ నెల "స స" కార్యక్రమంలో "ఈ వేస్ట్ డిస్పోజల్" కార్యక్రమంను నిర్వహించుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఏదో ఒక పంచాయతీ రాజ్ లేదా మున్సిపల్ కార్యాలయం యొక్క శానిటేషన్, డ్రైనేజ్ క్లీనింగ్ కార్యక్రమంలా కాకుండా ప్రజల్లో చైతన్యం కలిగించే కార్యక్రమం లా తీర్చి దిద్దుదాం అనే సంకల్పంతో కూడి ప్రజల భాగస్వామ్యం కలిగించే సామాజిక స్పృహ తో కూడి రూపొందించడం జరిగిందన్నారు. తక్కువ వ్యర్థాలు ఉండేలా, తిరిగి వినియోగించాలి, వ్యర్థాలు తగ్గించాలి అనే "ఆర్ ఆర్ ఆర్" కాన్సెప్ట్ తో కూడి కార్యక్రమాన్ని రూపొందించడం జరిగిందన్నారు. అందులో భాగంగానే ఈ శనివారం ఈ వేస్ట్ మేనేజ్మెంట్ తో కూడిన కార్యక్రమానికి రూపకల్పన చేస్తున్నట్లు తెలిపారు. ఏప్రియల్ 19 వ తేదీన జరిగే కార్యక్రమంలో ప్రజాప్రతినిధుల , ప్రజలందరి భాగస్వామ్యంతో "స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర ప్రో గ్రాం" విజయవంతం చేయాలని పిలుపు ఇచ్చారు. స్థానిక రాజమండ్రి రూరల్ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయం ఉన్న వైటిసి భవనంలో ఏప్రియల్ 19 శనివారం ఉదయం జిల్లా స్థాయి సా సా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలియ చేశారు.

ఉపాధ్యాయుల కృషి ఎనలేనిది : ఎమ్మెల్యేలు

విశాలాంధ్ర – కడియం : ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని, విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల కృషి ఎనలేనిదని రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, పెద్దాపురం మాజీ ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు అన్నారు. కడియం మండల పరిషత్ కార్యాలయంలో తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి, వేమగిరి ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కంచెపు జయరాజు పదవి విరమణ సందర్భంగా సన్మాన కార్యక్రమాన్ని కడియం ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్యప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాజమండ్రి రూరల్ ఎంఎల్ఏ గోరంట్ల బుచ్చియ్య చౌదరి, పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చిన్న రాజప్ప, మాజీ ఎమ్ఎల్సి చిక్కాల రామచంద్రరావు, రాష్ట్ర హెల్త్ ప్రధాన కార్యదర్శి గోరంట్ల రవికుమార్, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, డీఈవో వాసుదేవరావు తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈసందర్భంగా జయరాజును తోటి ఉపాధ్యాయులు, అధికారులు, నాయకులు ఘనంగా సత్కరించారు. అనంతరం డిఈఓ వాసుదేవరావు మాట్లాడుతూ 39 సంవత్సరాల సుదీర్ఘ కాలం పాటు ఉపాధ్యాయ వృత్తిని జయరాజు విజయవంతంగా నిర్వహించారని, ఆయన విద్యార్థులకు ఎంతో సేవలందించారని అన్నారు. అంకితభావంతో పనిచేసి, విద్యార్థులు పాఠశాల ప్రగతికి కృషి చేసిన ఆయనను సన్మానించడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు మణికుమార్, వై నాగేశ్వరరావు, యుటిఎఫ్ ప్రతినిధులు, ఎస్‌టియు ప్రతినిధులు, ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖ ఉద్యోగులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ తప్పుడు ప్రచారాలు మానుకోవాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర – రావులపాలెం : గోశాల వ్యవహారంపై వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు హెచ్చరించారు. రావులపాలెం క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే సత్యానందరావు, ఆకుల రామకృష్ణ పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గోశాలలో గోవులు మరణించకపోయినా మరణించినట్లు రాద్ధాంతం చేయడం సరికాదని, నిజాలను బయట పెడతామని వెల్లి రోడ్డుపై బైఠాయించడమేంటని మండిపడ్డారు. టిటిడి గోశాలలో గోవులు మృతి చెందాయని వైసిపి నేత, టిటిడి మాజీ చైర్మన్ భూమా కరుణాకర్ రెడ్డి తప్పుడు ప్రచారమని, తిరుమలలో వైసిపి హయంలో జరిగిన అక్రమాలను, అపచారాలను సరిదిద్ది తిరుమల పవిత్రను కూటమి ప్రభుత్వం కాపాడుతోందని తెలిపారు. కూటమి ప్రభుత్వానికి, టిటిడి పాలక మండలికి వస్తున్న మంచిపేరుచూసి ఓర్వలేక వైసీపీ రోజుకో వివాదాన్ని సృష్టిస్తోందన్నారు. నాడు వైసీపీ ప్రభుత్వం వీఐపీ సేవలో తరిస్తే నేడు కూటమి ప్రభుత్వం సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తుందని అన్నారు. భూమన కరుణా కరరెడ్డికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే తిరుమలలో సర్వ దర్శనం చేసుకొని బయటకు వచ్చిన భక్తులను అడిగితే ఎవరి పాలనలో తిరుమల ఎలా ఉందో భక్తులే చెపుతారన్నారు. ఈ కార్యక్రమంలో విల్లా మారుతీ, కొప్పిశెట్టి ప్రసాద్, బొక్క ప్రసాద్, బోడపాటి మారుతీ, మజ్జి తరుణ్, జక్కంపూడి బాలాజీ, కముజు వర ప్రసాద్, దంగేటి సాయి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర – అనపర్తి : కూటమి ప్రభుత్వం అధికారంలోకి చేపట్టిన తర్వాత అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళ్లడం జరుగుతుందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం రామవరంలో ఎమ్మెల్యే నల్లమిల్లి పలు సిసి రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి (దత్తుడు శ్రీను), సర్పంచులు గొల్లు హేమ తులసి, గిరడా గంగాభవాని, నల్లమిల్లి సుబ్బారెడ్డి, తేనెల శ్రీను, చింతా సురేష్ రెడ్డి, ద్వారంపూడి చిన రామ్మూర్తి రెడ్డి, తహసీల్దార్ అనిల్ కుమార్, ఎంపీడీవో రామకృష్ణారెడ్డి ఇంకా పలువురు ఎన్డిఏ నేతలు,కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రాన్స్ జెండర్ల సమస్యలపై న్యాయ విజ్ఞాన సదస్సు

విశాలాంధ్ర – రాజమహేంద్రవరం : తూర్పు గోదావరి పెర్మనెంట్ లోక్ అదాలత్ చైర్మన్ ఏ. గాయత్రి దేవి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ శ్రీమతి ఎన్. శ్రీ లక్ష్మి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సంధు 'ట్రాన్స్ జెండర్ల హక్కులు మరియు సమస్యల' గురించి న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో డీఎల్ఎస్ఎ కార్యదర్శి ఎన్. శ్రీలక్ష్మి మాట్లాడుతూ ట్రాన్స్ జెండర్లకు భారత రాజ్యాంగం , గౌరవ సుప్రీం కోర్టు వారి ఆదేశాల ద్వారా వారికి అందించబడిన హక్కుల గురించి వివరించారు. వారి పట్ల ఎవ్వరూ వివక్ష చూపరాదన్నారు. స్త్రీ పురుషులకు సమంగా వారికి అన్ని హక్కులు ఉన్నాయని తెలిపారు. వారి హక్కులను వినియోగించుకుని అభివృద్ధి సాధించాలన్నారు. ఈ విషయంలో వారికి ఎలాంటి సహకారం కావాలన్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎప్పుడూ వారికి అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం సెంట్రల్ జోన్ డి.ఎస్.పి కె. రమేష్ బాబు, రాజమహేంద్రవరం అసిస్టెంట్ సివిల్ సప్లయ్ ఆఫీసర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో , వెల్ఫేర్ ఆఫ్ ట్రాన్స్ జెండర్ల అధికార్లు, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ అధికార్లు, మెప్మా అధికార్లు, లీగల్ అయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ సభ్యులు, సాతి ఆర్గనైజేషన్ సభ్యులు, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలను కాపాడుకుందాం పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర – పిఠాపురం : స్థానిక సూర్య గ్రంథాలయంలో ప్రభుత్వ పాఠశాలను కాపాడుకుందాం అనే బృహత్తర ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ గోడ పత్రిక ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమాన్ని ప్రచారం చేస్తూ ప్రభుత్వ పాఠశాలలో వచ్చే విద్యా సంవత్సరం ప్రవేశాలు పెంచుటకు సమాజంతో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులను, ఇతర ప్రజా సంఘాలను భాగస్వామ్యం చేయాలని, తద్వారా పేద ప్రజలకు ప్రభుత్వ విద్య, నాణ్యమైన విద్య అందుబాటులో ఉంటుందని తెలియజేశారు. విద్యా వ్యవస్థ ప్రైవేటీకరణ పెరిగి పేద ప్రజల సంపాదనలో అధిక భాగం బడి ఫీజులు కట్టడానికి సరిపోతుందని, ప్రభుత్వ విద్య కాపాడుకోవడం ద్వారా ప్రజలపై ఆర్థికభారం తగ్గుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక పిఠాపురం మండల అధ్యక్షుడు సరాల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు నారాయణ మరొక ఉపాధ్యక్షుడు బి సుబ్రహ్మణ్యం, గౌరవ అధ్యక్షుడు వి సత్యనారాయణ రెడ్డి, కార్యకర్తలు కే విశ్వనాథం, మన ఊరు మన బాధ్యత అధ్యక్షుడు కొండేపూడి శంకర్రావు, మద్యపాన వ్యతిరేక కమిటీ సభ్యుడు నక్కా సూర్యనారాయణ, ఉపాధ్యాయులు ఎంవివి సత్యనారాయణ పాల్గొన్నారు.

దోషులను అరెస్టు చేయాలని ధర్నా

విశాలాంధ్ర – శంకవరం : కాకినాడ జిల్లా శంఖవరం మండలం శంకవరం గ్రామంలో అంబేద్కర్ జయంతి సోమవారం 12 గంటలు దాటిన తర్వాత కొంత మంది దుండగులు అంబేద్కర్ విగ్రహానికి చెప్పులు దండ వెయ్యడం జరిగింది. దీనిని స్థానికంగా ఉన్న దళితులు ప్రజా స్వామ్యవాదులు అందరూ ఖండించారు. దోషులను అరెస్టు చేయాలని దళితులు చేస్తున్న ధర్నాకు సిపిఐ ఎమ్ఎల్ లిబరేషన్ తన పూర్తి మద్దతును తెలియజేసింది. రాష్ట్ర కమిటీ సభ్యులు మానుకొండ లచ్చబాబు, విప్లవ యువజన సంఘం నాయకులు చిన్నం నాని బాబులు నాయకత్వంలో ఒక టీం శంఖవరం గ్రామంలో పర్యటించి దళితులు చేస్తున్న ధర్నా వద్ద సంఘీభావాన్ని ప్రకటించి చెప్పులు దండ వేసిన ముద్దాయిలను వెంటనే అరెస్టు చేయాలన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

విశాలాంధ్ర - కొత్తపేట : కొత్తపేట మండలంలో క్రైస్తవులు గుడ్ ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకున్నారు. స్థానిక పినిపే వారి పేట, ప్రవచన దేవుని సంఘం ఎరుషలేం చర్చ్ బిషప్ జి ఆబెద్నగో ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే కార్యక్రమాన్ని ఆచరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తు ప్రభువు వారు సకల మానవాళి పాపపరిహారార్థమై సిలువ యాగం పొందిన రోజును జ్ఞాపకం చేసుకుంటూ ఈ కార్యక్రమంలో యేసు క్రీస్తు ప్రభువు వారు సిలువపై పలికిన ఏడు మాటలను జ్ఞాపకం చేసుకుంటూ అనేకమంది భక్తులు ఉప వాసంతో మందిరంలో గడిపారు. అనంతరం సిలువ శాంతి యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనేకమంది పాస్టర్లు విశ్వాసులు పాల్గొన్నారు.

16వ ఆర్థిక సంఘం నిధులు కేటాయించాలి

విశాలాంధ్ర - సామర్లకోట : 16వ ఆర్థిక సంఘం ప్రతినిధుల సమావేశంలో సామర్లకోట మున్సిపల్ చైర్పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి భేటీ అయ్యారు. 16వ ఆర్థిక సంఘం నిధుల కేటాయింపు విషయంలో శుక్రవారం తిరుపతిలో జరిగిన రాష్ట్ర స్థాయిలో ఎంపిక చేసిన మేయర్లు, మున్సిపల్ చైర్మన్ల డెలిగేట్స్ సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా సామర్లకోట మున్సి పాలిటీకు ప్రాముఖ్యత దృష్ట్యా 16వ ఆర్థిక సంఘం నిధులు కేటాయించాలని ఆయా ప్రాధాన్యతలను చైర్పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి వివరించారు.

భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

విశాలాంధ్ర - సామర్లకోట : క్రైస్తవ ప్రజల అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకునే గుడ్ ఫ్రైడే ప్రార్థనలు అన్ని క్రైస్తవ దేవాలయాల్లో శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దానిలో భాగంగా సామర్లకోట ఆర్సీఎం చర్చి ఆధ్వర్యంలో నిర్వహించిన యేసుక్రీస్తు సిలువ యాత్ర పట్టణ ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది. సామర్లకోట స్టేషన్ సెంటర్ నుండి జూనియర్ కాలేజీ ఎదురుగా ఉన్న ఆర్ఎంసి చర్చి వరకు ఈ సిలువ యాత్ర సాగింది. రెండువేల సంవత్సరాల క్రితం మానవాళి పాపాల ప్రక్షాళన నిమిత్తం సిలువలో మరణించిన సందర్భాన్ని జ్ఞాపకం చేసుకుంటూ స్థానిక ఆర్సీఎం చర్చి వద్దనుంచి స్టేషన్ సెంటర్ వరకు తిరిగి స్టేషన్ సెంటర్ గడియార స్తంభం వద్దనుంచి సిలువ యాత్ర చేశారు.

శ్రీ స్ఫూర్తి ఫౌండేషన్ మెగా రక్తదాన శిబిరం

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : తొండంగి మండలం వేమవరం గ్రామంలో శ్రీ స్ఫూర్తి ఫౌండేషన్ రెండవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ రక్తదాన కార్యక్రమానికి అనేక మంది యువతీ, యువకులు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేశారు. శ్రీ స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు నేమాల శ్రీనివాసరావు (యస్ఎస్ఆర్) మండుటి ఎండను సైతం లెక్కచేయకుండా 108 మంది రక్తదాతలు వచ్చి రక్తదానం చేసి ప్రాణదానం చేసిన ప్రతి ఒక్కరికి ఫౌండేషన్ తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సప్తగిరి హేచరీస్ అధినేత పెదబాబు, కొయ్య శ్రీనిబాబు, శ్రీయువసేన బ్లడ్ బ్యాంకు సతీష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులు, హేచరీల ఓనర్స్, ఫౌండేషనకు ఇప్పటి వరకు ఆర్థిక సహకారం అందించిన చేతులు మీదగా రక్తదానం చేసిన ప్రతి రక్తదాతకు మెమెంటో, సర్టిఫికెట్, శాలువతో చిరు సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ స్ఫూర్తి ఫౌండేషన్ కుటుంబ సభ్యులు, వేమవరం పెద్దలు, యువత పాల్గొన్నారు.

అభూత కల్పనలు సృష్టిస్తున్న భూమన : ఎమ్మెల్యే జ్యోతుల

విశాలాంధ్ర - జగ్గంపేట : టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి అభూత కల్పనలు సృష్టిస్తున్నారని జగ్గంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మండిపడ్డారు. నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడుతూ టిటిడి గోశాలలో ఆవులు చనిపోయాయని భూమన అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. రెండు సార్లు బోర్డు మెంబర్‌గా, 2 సార్లు చైర్మన్‌గా ఉన్నప్పుడు ఎప్పుడైనా గోశాలను సందర్శించారా అని ప్రశ్నించారు. అసలు గోశాలలు ఎక్కడ ఉన్నాయో తెలుసా అన్నారు. టిటిడికి ఉన్న మూడు గోశాలల్లో ఒకటి తిరుమలలోనూ, రెండోది పలమనేరులోను మూడవది తమ్మయ్యపాలెంలోను ఉన్నాయన్నారు. 1956లో ఏర్పాటు చేసిన దగ్గర నుండి నెలకు 12 గోవులు ఈ మూడు గోశాలలో చనిపోతున్నాయని, అలాగే 15 ఆవులు గోశాలలో పుట్టటం, దానం ఇవ్వడం ద్వారా వస్తున్నాయన్నారు. వైసీపీ ప్రభుత్వంలో థియేటర్ల దగ్గర బ్లాక్ టిక్కెట్లు అమ్ముకున్న మాదిరిగా దర్శనం టిక్కెట్లు అమ్ముకునే వారని విమర్శించారు. టీటీడీని అక్రమార్జనకు వాడుకున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం సెక్యులర్‌ను గౌరవించే ప్రభుత్వమని, ఏ మతాన్ని ఐనా గౌరవిస్తుందన్నారు. అందుకే నేడు పాస్టర్లకు ఒకొక్కరికి 7 నెలలకు రూ.35 వేలు చొప్పున విడుదల చేయడం జరిగిందన్నారు. గోశాలలో ఆవులు చనిపోయాయని అసత్య ఆరోపణలు చేస్తున్న కరుణాకర్‌రెడ్డిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని వచ్చే బోర్డు సమావేశంలో ఫిర్యాదు చేస్తానన్నారు. ఈ సమావేశంలో మురారి ఉప సర్పంచ్ జాస్తి వసంత్, టిడిపి నాయకులు ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, బోధిరెడ్ల సుబ్బారావు, బద్ది సురేష్ పాల్గొన్నారు.

గ్రామాన్ని అభివృద్ధి చేస్తాం : ఎమ్మెల్యే, ఎంపీ

విశాలాంధ్ర - కొత్తపేట : వాడపాలెం గ్రామంలో వాటర్ ట్యాంక్, వేస్ట్ మేనేజ్మెంట్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే సత్యానందరావు, ఎంపీ హరీష్ కొత్తపేట మండలం వాడపాలెం గ్రామాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణరావు హామీ ఇచ్చారు. గ్రామంలో అనేక అభివృద్ధి పనులను స్థానిక ఎమ్మెల్యే బండారు, పార్లమెంట్ సభ్యులు గంటి హరీశ్ మాధూర్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రజలకు తాగు నీటి సరఫరా కోసం ఇంటింటికీ తాగునీటి పథకం ద్వారా రూ.89.80 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన వాటర్ ట్యాంకును ప్రారంభించారు. అలాగే రూ.15 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించిన ఘన ద్రవ్య వ్యర్థ పదార్థముల నిర్వహణ కేంద్రాన్ని ప్రారంభించారు. గ్రామంలో కొన్ని అభివృద్ధి పనులు నిర్మాణం పూర్తి కానున్నాయని త్వరలోనే వాటిని ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. అభివృద్ధి కోసం అడిగిన వెంటనే నిధులు మంజూరు చేసిన ఎంపీ హరీష్ ధన్యవాదాలు తెలియజేశారు. ఎంపీ హరీష్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ఎమ్మెల్యే సత్యానందరావు కోరిక మేరకే నిధులు మంజూరు చేయడానికి సిద్ధంగా ఉన్నానని అభివృద్ధి కోసం కృషి చేయడంలో ఎమ్మెల్యేకు తోడుగా ఉంటానని తెలిపారు. అలాగే మందపల్లి గ్రామంలో ఏటి గట్టుపై ఎంపీ నిధులు 30 లక్షల రూపాయలతో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టుమిషన్ శిక్షణ

విశాలాంధ్ర - పి గన్నవరం : ఉపాధి పొందడానికి ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని పి గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. పి గన్నవరం మహిళా శక్తి కార్యాలయం వద్ద అధికారులు నిర్వహించిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ శిక్షణ కేంద్రం ద్వారా గ్రామీణ మహిళలు ఆధునిక కుట్టు మిషన్లపై శిక్షణ పొందుతారు. ఉచితంగా మిషన్లు, మార్కెటింగ్ మద్దతు వంటి అనేక అవకాశాలు అందించబడతాయన్నారు. మహిళలు స్వయం ఉపాధితో ఎదిగేలా ప్రభుత్వం కృషి చేస్తోంది. ప్రతి కుటుంబంలో ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యం" అని తెలిపారు. ఎన్‌డిఏ ప్రభుత్వ పర్యవేక్షణలో పి గన్నవరం మండల మహిళలకు అభివృద్ధి తలుపులు తెరుస్తుంది. మహిళలు ఈ శిక్షణలో పాల్గొని తమ జీవితాలను మెరుగుపరచు కోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గణిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్ బొండాడ నాగమణి, స్థానిక కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేటలో ముస్లింలు నిరసన

విశాలాంధ్ర - జగ్గంపేట : మండల కేంద్రమైన జగ్గంపేటలో ముస్లింలు శుక్రవారం నిరసన ర్యాలీ చేపట్టారు. వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును నిరసిస్తూ కాకినాడ రోడ్డులోని సున్నీ జామియా మసీదు నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ సెంటర్ వరకు నిరసన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మాజీ వక్ఫ్ బోర్డు అధ్యక్షులు ఎస్ఏ గఫూర్ మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు బిల్లు సవరణ సరికాదన్నారు. ముస్లింల హక్కులకు భంగం కలిగించే విధంగా ఉన్న వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ షేక్ ఆరిఫ్, వైస్ ప్రెసిడెంట్ భాషా, సెక్రటరీ షేక్ రహమాన్, యద్ది ఇబ్రహీం, షేక్ మోహిద్దీన్, ఎస్కే వలీ, యమ్‌డి ఖాజా, యమ్‌డి జానీ, షేక్ అలీషా, షేక్ మీరాషా ముస్లింలు పాల్గొన్నారు.

సుపరిపాలన అందించడమే ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర - అనపర్తి/పెదపూడి : అభివృద్ధి, సంక్షేమం రెండు కలగలిపి సుపరిపాలన అందించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం పెదపూడి మండలం చింతపల్లిలో రూ.25 లక్షల వ్యయంతో చేపట్టే రెండు సిసి రోడ్లు,రూ.7.60 లక్షలతో నిర్మించే నాలుగు గోశాలలు, పశువుల త్రాగు నీరు నిల్వ ఉంచే తొట్టెల నిర్మాణానికి ఎమ్మెల్యే నల్లమిల్లి శంకుస్థాపన చేశారు. గండ్రేడులో రూ.20 లక్షల వ్యయంతో చేపట్టే రెండు సిసి రోడ్ల నిర్మాణానికి, రూ.7.25 లక్షలతో నిర్మించే మూడు గోశాలలు, పశువులు తాగునీరు ఉంచే తొట్టెలు నిర్మాణానికి ఎమ్మెల్యే నల్లమిల్లి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా కాండ్రేగుల, పుట్టకొండ, శహపురం లంకలో పలు రోడ్ల నిర్మాణానికి, పశువుల తొట్టెల నిర్మాణానికి, శహపురంలో రూ.20 వ్యయంతో నిర్మించే వాటర్ ట్యాంక్ నిర్మాణానికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో ఎన్డిఏ నేతలు జుత్తుక సూర్యకుమారి,రావాడ నాగు, ఎంపీడీవో కె నరేంద్ర రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో ఎమ్ఎస్ఎన్ రెడ్డి, తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గింజ ప్రభుత్వం కొనుగోలు : మర్రెడ్డి

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : రైతుల పండించిన ప్రతి గింజను రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని పిఠాపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్ అన్నారు. కొత్తపల్లి మండలంలోని ఇసుకపల్లి, ఎండపల్లి గ్రామాల్లో శుక్రవారం అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ధాన్యం కల్లాల వద్దకు వెళ్లి ధాన్యం రాశులను పరిశీలించారు. ధాన్యం అమ్మకాలపై రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం అమ్మకాల విషయంలో రైతులెవ్వరు తొందర పడవద్దు అన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు ధాన్యాన్ని విక్రయిస్తే తొందరగా సొమ్ము తమ బ్యాంకు ఖాతాలోకి చెమ అవడం జరుగుతుందన్నారు పిఠాపురం నియోజకవర్గ వ్యవసాయ శాఖ అధికారి స్వాతి, మండల వ్యవసాయ శాఖ అధికారి జోగిరాజు, డిప్యూటీ తహసీల్దార్ మురళీకృష్ణ, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

యేసు క్రీస్తు త్యాగాన్ని స్మరించుకున్న ఎమ్మెల్యే

విశాలాంధ్ర - రావులపాలెం : ఈ పవిత్ర గుడ్ ఫ్రైడే అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి రావులపాలెం బేతెస్థా ప్రార్థన మందిరంలోని కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యేసు క్రీస్తు చేసిన గొప్ప త్యాగాన్ని స్మరించుకున్నారు. త్యాగం, క్షమ, ప్రేమ అనే విలువలను మన జీవితంలో అమలుపరచుకుందాం, సమాజ సేవలో కృషి చేస్తూ ప్రతీ ఒక్కరికి శాంతి నమ్మకాన్ని పంచే మార్గంలో ముందుకు సాగుదాం అని ఆయన అన్నారు. కర్రి నాగిరెడ్డి, కర్రి గోవింద కృష్ణారెడ్డి, సత్తిరెడ్డి, రామారెడ్డి, కొవ్వూరి సుధాకర్ రెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా గుడ్ ఫ్రైడే

విశాలాంధ్ర-దేవరపల్లి: సందర్భంగా గౌరీపట్నం నిర్మలగిరి మేరీ మాత పుణ్యక్షేత్ర డైరెక్టర్ ఎస్ జాన్ పీటర్ యేసు శిలువను మోస్తూ గౌరీపట్నం గ్రామంలో పురవీధుల నందు ఏసు నామములను కీర్తిస్తూ ఏసుప్రభు గొప్పతనాన్ని వివరిస్తూ పరిశుద్ధ సిలువ మార్గమును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ జనిస్ ఫాదర్ ఏసుబాబు ఫాదర్ గిరీష్ నిర్మలగిరి డిగ్రీ కళాశాల సిస్టర్స్ స్కూల్ సిస్టర్స్ ఎల్ ఏ ఆర్ సిస్టర్స్ రోషిత ప్రియ వద సునీత విరిసినపాతిమారాణి గౌరీపట్నం సంఘస్తులు ఏసుప్రభు మాలలు ధరించిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దేవరపల్లి మండలంలో గుడ్ ఫ్రైడే వేడుకలు క్రైస్తవ సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు దేవరపల్లిలోని లైట్ హౌస్ బాప్టిస్ట్ చర్చిలో చర్చ్ పాస్టర్ ఎం గాబ్రియేలు గుడ్ ఫ్రైడే విశిష్టతను ఆయన వివరించారు అనంతరం చర్చిలో భక్తులు సిలువలోని ఏడు మాటలు ధ్యానం చేశారు మండలంలోని దేవరపల్లి పల్లంట్ల దుద్దుకూరు గౌరీపట్నం చిన్నాయగూడెం సంగాయిగూడెం ఎర్నగూడెం లక్ష్మీపురం త్యాజం పూడి గ్రామాల్లో ప్రార్థన మందిర్లో గుడ్ ఫ్రైడే దినోత్సవాన్ని క్రైస్తవ సోదరులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

విలువలతో కూడిన విద్య అందిస్తున్నాం : అనీష్

విశాలాంధ్ర- తాళ్లపూడి : మంచి విద్యార్థి కావాలంటే మంచి స్కూల్ మాత్రమే కాదని, సమాజానికి అపకారం చేస్తోన్న సెల్ ఫోన్ను దూరంగా ఉంచి తల్లి తండ్రులు మంచి నడవడిక నేర్పాలి అని తాళ్లపూడి ఎస్సై తోట రామకృష్ణ పేర్కొన్నారు. ఆయన మాంటిస్సోరీ స్కూల్ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసారు. సెల్ ఫోన్కి ఆకర్షితులైతే పిల్లల నడవడిక మారిపోతుందన్నారు. విలువలతో కూడిన విద్యను గత 23 సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంతంలో విద్యార్థులకు అందిస్తు న్నట్లు, మాంటిస్సోరీ స్కూల్ కరస్పాండెంట్ అనీష్ పేర్కొన్నారు. మండల కేంద్ర మైన తాళ్లపూడిలో మాంటిస్సోరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కరస్పాండెంట్ అనీష్ దంపతులు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన కార్యక్రమంలో ఎల్.కె.జి, యూ.కె.జి చిన్నారులు ఆట పాటల తో అలరించారు. స్కూల్ లో జరిగిన కార్యక్ర మాల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు, స్టడీస్ లో ఉత్తమ విద్యార్థులకు బహుమతులు అందచే శారు. తమ స్కూల్ ను ఆదరిస్తున్న తల్లి తండ్రులు కు ధన్యవాదాలు తెలిపారు. పిల్లల తల్లి తండ్రులను ప్రోత్సహిస్తూ బహుమతులు అందచేశారు.

యాదవోలు వాగు పరివాహక ప్రాంతం సుందరీకరణ

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లిలో యాదవోలు వాగు పరివాహ ప్రాంతాన్ని శుభ్రపరచడానికి సుందరీ కరణ చేయటానికి మొదటి విడతలో రూ.2 కోట్ల వ్యయంతో పనులు చేపడుతామని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పేర్కొన్నారు. దేవరపల్లిలో శుక్రవారం సాయంత్రం యాదవోలు వాగు పరివాహక ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. దాదాపు కిలోమీటర్ ఆయన పరివాహక ప్రాంతాన్ని పరిశీలించి స్థానిక సమస్యలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు మాట్లాడుతూ దేవరపల్లి గ్రామం మధ్య గుండా యాదవోలు వాగు పెడుతుందని ఆయన తెలిపారు. వాగు ఇరుపక్కల వాగులో గల పిచ్చి మొక్కలు చెత్తాచెదారం తొలగించి మొదటి దశలో రూ.2 కోట్ల రూపాయల వ్యయంతో పనులు చేపడతామని అన్నారు. వెంకటేశ్వర స్వామి ఆలయం సమీపం నుండి చెరువు స్మశానంకు వెళ్లే దోవలో ప్రస్తుతం ఉన్న మూడు మీటర్లు డ్రెన్ను ఆరు మీటర్ల వరకు పెంచి పూడిక తీస్తామని తెలిపారు. ఇదే విధంగా స్టేట్ బ్యాంకు వీధిలో తోపాటు పోతన కుంట పరివాహ ప్రాంతం చెరువు

సుందరీ కరణ పనులు రెండవ దశలో చేపడతామన్నారు. గ్రామస్తులు కూడా పూర్తిస్థాయిలో సహకరించాలని ఆయన కోరారు. అంతకుముందు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు దేవరపల్లి గ్రామ దేవత కడియాలమ్మ అమ్మవారిని సందర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విష్ణుభట్ల రామారావు పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నేతలు ఎలమాటి అక్కిరాజు పిన్నమనే శ్రీధర్ బి నాగేశ్వరరావు సూరిశెట్టి బాబు సుతాపెల్లి సత్య శ్రీనివాస్ ఓరుగంటి సత్యనారాయణ రాజు దేవరపల్లికి చెందిన తెలుగుదేశం జనసేన నేతలు జాజిమొగ్గల శ్రీనివాస్ గద్దె సుబ్రహ్మణ్యం సింహాద్రి రామకృష్ణ ముళ్లపూడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యార్డు చైర్మన్ పదవి మండలానికి ఇవ్వాలి : తెలుగు తమ్ముళ్లు

విశాలాంధ్ర - రాజానగరం : మార్కెట్ కమిటీల (ఏఎంసీ)కు చైర్మన్ పదవి రాజానగరం మండలం నాయకులను నియమించాలని మండల తెలుగు తమ్ముళ్లు డిమాండ్ చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ నియామకాలను ఎన్డీఏ కూటమి ప్రభుత్వం త్వరలోనే ప్రకటించనున్నారు. ప్రస్తుత ఏఎంసీ పదవి బీసీ వర్గానికి కేటాయించనున్నన్నట్లు సమాచారం. అభ్యర్థుల ఎంపిక కోసం మండలంలోని దివాన్ చెరువు గ్రామంలో ఇందుకు సంబంధించి టీడీపీ నేతలు శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా రుడా చైర్మన్, నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జ్ బొడ్డు వెంకట రమణ చౌదరికి వినతి పత్రం అందజేయనున్నారు. ఈ సందర్భంగా పలువురు టిడిపి నేతలు విశాలాంధ్రతో చరవాణిలో మాట్లాడుతూ ఏఎంసీ పదవులు సీతానగరం, కోరుకొండ మండలాలకు గతంలో కేటాయించారని చెప్పారు. ఈ వరస క్రమంలో ప్రస్తుతం

నియమించలసిన చైర్మన్ పదవిని రాజానగరం మండలానికి కట్టబెట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వంక మల్లిఖార్జున స్వామి(మల్లిబాబు), తెలుగు యువత జిల్లా అధ్యక్షులు కందుల బాబు రాయుడు, ఏపీ రాష్ట్ర యాదవ సంక్షేమ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు (నాగు),టీఎన్టియూసి జిల్లా అధికార ప్రతినిధి దాసరి శ్రీనివాస్, సీనియర్ నాయకులు గంగి బ్రహ్మాజు, పలివెల గంగరాజు, మట్టా సత్తిబాబు, కోఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ నీలపాల పండు,పంచికట్ల నాగు, ఎన్డీఏ కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పొత్తు ధర్మాన్ని పాటిస్తూ...పవన్ మాటకు విలువిస్తాం...

విశాలాంధ్ర - నిడదవోలు : పొత్తు ధర్మాన్ని పాటిస్తూ జనసేన అధినేత పవన్ మాటకు విలువిస్తూ కూటమి బలోపేతానికి సమష్టిగా పనిచేస్తున్నామని నిడదవోలు జనసేన నాయకులు స్పష్టం చేశారు. నాడు టిడిపికి వ్యతిరేకంగా వ్యవహరించిన వైసిపి నాయకులను జనసేన లోకి చేర్చుకోవడాన్ని నిరసిస్తూ బుధవారం వేలివెన్నులో జరిగిన తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకుల సమావే శంలో పట్టణ టీడీపీ అధ్యక్షులు కొమ్మిన వెంకటేశ్వరరావు రాజీనామా చేశారు. పొత్తు ధర్మానికి వ్యతిరేకంగా జనసేన పార్టీ వ్యవహరిస్తుందంటూ ఆయన చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం నిడదవోలు జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ మేరకు మాట్లాడారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ ఎన్ని ఇబ్బందులు వచ్చినా 15ఏళ్ల పాటు ఎన్డీఏ కూటమి అధికారంలో ఉంటుందన్న తమ పార్టీ అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాటకు కట్టుబడి తామంతా కూటమితో కలిసే ఉంటామన్నారు. అధినేత నిర్ణయానికి అనుగుణంగానే తాము నడుచుకుంటా మన్నారు. వైసిపి కబంధహస్తాల నుంచి రాష్ట్రాన్ని కాపాడ లనే లక్ష్యంతో టీడీపీ, బీజేపీ, జనసేనలు కలిసి కూటమి ప్రభుత్వాన్ని ఏర్పరచుకున్నామన్నారు. ఈ క్రమంలో కొంత అసంతృప్తి ఉండటం సహజమేనని వెల్లడించారు. కూటమి ధర్మాన్ని పాటించి ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన ప్రతి సమాచారం కూటమిలోని ప్రతి ఒక్కరికీ అందిస్తున్నా మన్నారు. కూటమిలోని జనసేన నుండి ఎన్నికైన మంత్రి వర్యులు దుర్గేష్ మొదటినుండి టీడీపీ, బీజేపీ నేతలతో సఖ్యతగా ఉండాలనే తమకు చెప్పారని తాము కూడా అదే పాటిస్తున్నామన్నారు. తమ నేత దుర్గేష్కు నిడదవోలు

టికెట్ వచ్చింది మొదలు అటు నియోజకవర్గ అభివృద్ధికి, ఇటు రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలో మొదటి నుంచి జనసేన నేతలు, జన సైనికులు సంయమనంతోనే ఉంటూ కూటమి ధర్మాన్ని పాటిస్తున్నామన్నారు. మంత్రి కందుల దుర్గేష్ నియోజకవర్గంలో నామినేటెడ్ పదవుల నియామకంలో టిడిపి నేతలకు అగ్రభాగం ఇస్తూనే ఉన్నారని తెలిపారు. స్థానిక తెలుగుదేశం నాయకత్వం చెప్పిన ప్రతిఅంశాన్ని పరిగణలోకి తీసుకొని అమలు చేస్తున్నారన్నారు. బదిలీలు, పదవుల పంపకాల విష యంలో ప్రధానంగా నీటి సంఘాలు, సొసైటీ ప్రెసిడెంట్ల విషయంలో టీడీపీకే అధిక ప్రాధాన్యత ఇచ్చామన్నారు. ఇప్పటివరకు ఏ చిన్న నేత గౌరవానికి భంగం కలిగేలా వ్యవహరించలేదని అలా వ్యవహరించబోమన్నారు. జన సేన పార్టీ విధివిధానాలు, అధినేత పవన్ కళ్యాణ్ వ్యవ హారశైలి నచ్చి పార్టీలోకి వచ్చేవారిని స్వాగతించడంలో తప్పేముందన్నారు. ప్రజలకు అండగా ఉంటామంటూ వచ్చే నేతలనే పార్టీలోకి స్వాగతి స్తున్నామన్నారు. కొందరు కావాలనే కూటమి పార్టీల మధ్య చిచ్చు పెట్టాలనుకుంటే అలాంటి విధానాలను ఏ పార్టీ సహించదన్నారు. ఈ సమావేశంలో పట్టణ జనసేన అధ్యక్షులు రంగా రమేష్ ఉపాధ్యక్షులు ఎస్.కె షబ్బీర్, కార్యదర్శి బాలు, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల వీరస్వామి, వీకే రాజా, పవన్, నాగేంద్ర,పార్వతి పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంపై విమర్శలు తగదు : చప్పిడి

విశాలాంధ్ర - కాకినాడ : గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పులను కూటమి ప్రభుత్వంపై రుద్దే ప్రయత్నం చేస్తున్న గడ్డిమేసిన వైసీపీ పెద్దలు అని పాయకరావుపేట నియోజకవర్గం పరిశీలకులు రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్, వెనుకబడిన తరగతుల సంక్షేమ జేపీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. చేతకాని వైసీపీ పాలనలో 2022లో తిరుపతి పలమనేరు పలుచోట్ల 60 గోవులు చనిపోయిన నిర్లక్ష్యంగా దాచిపెట్టారు. నాసిరకం దాణా మందులు కొని కొన్నిచోట్ల గోవులు లేకుండా దాణా మందులు కొన్నట్లు లెక్కలు చూపి అనేక విధాలుగా అవినీతికి అప్పటి ప్రభుత్వం పాల్పడింది. చనిపోయిన గోవులను నిర్లక్ష్యంగా చెత్తబుట్టలో వేయడం జరిగింది. ప్రస్తుత మా కూటమి ప్రభుత్వం గోశాలలు సంరక్షించే విధంగా మంచి దాణా, మంచి మందులు ఇవన్నీ ఇస్తూ సక్రమము అయిన రీతిలో గోశాల నిర్వహించే దిశగా ప్రయత్నం చేస్తుంది. అయితే 2024లో వైసీపీ ప్రభుత్వంలో 179 ఆవులు చనిపోతే కొన్ని అనివార్య కారణాల వల్ల ప్రస్తుతం 40 మాత్రమే చనిపోవడం జరిగింది. వైసీపీ వాళ్ళు చేసిన తప్పులన్నీ కూటమి ప్రభుత్వంపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారు. ఆ విధానాన్ని మానుకోవాలని డాక్టర్ చప్పిడి సూచించారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వైసీపీ ప్రభుత్వం పనిచేసింది. ఆ శిక్ష ఇప్పుడు అనుభవిస్తున్నారని డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు తెలియజేశారు. ఈ సమయంలో బహుమానను గోసాలకి ఆహ్వానించిన రాకుండా రోడ్డుపై బైఠాయించి రాద్ధాంతం చేయటం చాలా విడ్డూరంగా ఉందని ప్రకటనలో తెలియజేశారు.

జూనియర్ కళాశాల భవనాన్ని నిర్మించండి

విశాలాంధ్ర - ఆలమూరు : ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణానికి ఓఎన్జిసి అధికారులు నిధులు కేటాయించాలని జూనియర్ కళాశాల విద్యార్థులు, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఓఎన్జిసి కార్యకలాపాల వల్ల ఇక్కడి నేల స్వరూపంలో మార్పులు ఏర్పడి కళాశాల భవనాలు దెబ్బతిన్నాయని వారు అభిప్రాయపడ్డారు. జిల్లాలో పలుచోట్ల ఈ కళాశాలతో పాటు నిర్మించిన భవనాలు దృఢంగానే ఉన్నాయని, అయితే ఇక్కడి భవనాల గోడలు మాత్రం పగుళ్లు ఏర్పడి పూర్తిగా శిథిలావస్థకు చేరాయని ఇందుకు ఓఎన్జిసి కార్యకలాపాలు సైతం ఒక కారణం అని వారు గళమెత్తారు. చుట్టుపక్కల గ్రామాల నిరుపేద విద్యార్థులకు విద్యను అందిస్తున్న ఈ కళాశాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇక్కడి వనరులను తీసుకుని వెళ్లడంతో పాటు ఈ ప్రాంతంలో విద్య వైద్యం మౌలిక సదుపాయాల కల్పన చేయాల్సిన బాధ్యత ఓఎన్జిసికి ఉందని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి రవికుమార్ అన్నారు. పలు అంశాలతో కూడిన వినతి పత్రాన్ని జాయింట్ కలెక్టర్ నిశాంతి, రెవిన్యూ, ఓఎన్జిసి అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ విద్యార్థి విభాగంతో పాటుగా కళాశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు పాల్గొన్నారు.

ముగ్గుళ్ళ గ్రామంలో చోరీ

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలో ముగ్గుళ్ళ గ్రామంలో కలకలం రేపిన చోరీ. వివరాల ప్రకారం ముగ్గుళ్ళ గ్రామ వాస్తవ్యులు కూచిపూడి మురళి కృష్ణ, కూచిపూడు లక్ష్మీ వారు పెళ్ళికి వెళ్ళి శుక్రవారం తెల్లవారు జామున ఇంటికి వచ్చి చూడగా తలుపులు తాళం పగలకొట్టి ఇంటిలోని సామాను చిందర వందరగా ఉండగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుల్లో రూ.25 వేల నగదు, కాసు బంగారం, 20 తులాలు వెండి, గ్యాస్ సిలిండర్ పోయింది అని ఫిర్యాదు చేశారు. అదే ఇంటిలో ఉన్న పోస్ట్ ఆఫీస్ గదిని తెరిచి సామానులను చిందర వందరగా చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

నవయుగ వైతాళికుడు కందుకూరి : పెనుగొండ

విశాలాంధ్ర-రావులపాలెం : తెలుగునాట సాంఘిక సంస్కరణ ఉద్యమాన్ని నడిపించిన గొప్పవాడు, నవయుగ వైతాళికుడు అని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశం మందిరంలో శుక్రవారం అరసం జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో కందుకూరి జయంతిని ఘనంగా నిర్వహించారు. అరసం సంఘం జిల్లా అధ్యక్షులు గండిస్వామి ప్రసాద్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో 'వీరేశలింగ మొకడు మిగిలెను చాలును' కవితాంశంపై కవి నీరాజనం నిర్వహించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నలుమూలల నుంచి పాల్గొన్న కవులు కందుకూరి కృషిపై కవితలు వినిపించారు. సాహిత్య వేత్తలు శ్రీపాద సీతామహాలక్ష్మి, కృష్ణశ్రీ, గొడవర్తి శ్రీనివాస్‌లు విశ్లేషించారు. అనంతరం గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక రాష్ట్ర కన్వీనర్ వల్లూరు శివ ప్రసాద్ అధ్యక్షతన 'వీరేశలింగం - సంస్కారణోద్యమం - సమకాలీనత' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రజలను అంధ విశ్వాసాలోకి నెడుతున్నప్పుడు వీరేశలింగం సమాజాన్ని తట్టి లేపారన్నారు. వితంతు వివాహాన్ని చేసి వీరేశలింగం, రాజ్యలక్ష్మిలు ధైర్య సాహసాలను చాటారన్నారు. బాలిక విద్య కోసం తన సొంత ఆస్తులను ఖర్చు చేసారన్నారు. కందుకూరిని నేటి తరం అధ్యయనం చేయాలనీ, వారి కృషిని గుర్తించి, ఆధునిక సమాజాన్ని శ్రమను గౌరవించే సమాజంగా తీర్చి దిద్దాలన్నారు. జేవివి సీనియర్ నాయకులు చల్లా రవికుమార్, కవి అద్దేపల్లి ప్రభు మాట్లాడుతూ నేటి కాలం అధునికమైనదే అయినప్పటికీ కందుకూరి ప్రశాంగికత నేటికీ చాలా ఉందన్నారు. కందుకూరి గొప్ప హేతువాది మానవతా వాది అని అన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జ్యోతిబసు, జే వివి రాష్ట్ర అధ్యక్షులు కేఎంఎంఆర్ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి ఖాజా మొహిద్దీన్, జిల్లా అధ్యక్షులు ఆర్ ఎస్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కందుకూరి జీవితాన్ని, ఆయన సాహిత్యాన్ని ప్రతీ ఒక్కరు అధ్యయనం చేయాలన్నారు. కవితలు వినిపించిన కవులకు ప్రశంసా పత్రాలను ప్రముఖులు చేతులు మీదుగా అందజేశారు. కార్యక్రమంలో పి లింగేశ్వరరెడ్డి, అరసం నాయకులు, కవులు, సాహితీ వేత్తలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం అభివృద్ధి పనులు : దాట్ల

విశాలాంధ్ర - తాళ్లరేవు : కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం పి మల్లవరం గ్రామ తెలుగుదేశం పార్టీ సమావేశం స్థానిక డిజిబి కళ్యాణ మంటపంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు గుత్తుల వెంకటరమణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విప్, ముమ్మిడివరం నియోజకవర్గం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలల కాలంలో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి వర్యులు లోకేష్ ఆధ్వర్యంలో చేపట్టనన్నారు. ఈనాడు పోలవరం అభివృద్ధి, రాజధాని అభివృద్ధి, గ్రామీణ రహదారులు అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. అదేవిధంగా గ్రామ కమిటీ సభ్యులు అందరూ తక్షణమే బూత్‌ల వారిగా ప్రతి 30 మంది సభ్యులకి ఒక కుటుంబం సాధికార సభ్యుడిని నియమించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ, ఉంగరాల వెంకటేశ్వరరావు, విళ్ళ సత్యనారాయణ, ధూళిపూడి సుబ్బారావు, పితాని విష్ణు, సత్యవతి, దున్న సుబ్రహ్మణ్యం, ధూళిపూడి సుబ్రహ్మణ్యం, వీవెం సుబ్బారావు, కృష్ణ, బళ్ళ చిరంజీవి, దడాల సత్తికొండ, దున్న క్రాంతి, వెంటపల్లి పురుషోత్తం, శివ, దొమ్మేటి లోవరాజు, వీరబాబు పాల్గొన్నారు.

దాట్ల దేవదానంకు కళారత్న పురస్కారం

విశాలాంధ్ర - కాజులూరు : కాజులూరు మండలం కోలంకలోని ఎస్‌డివిఆర్ఆర్‌పి ఉన్నత పాఠశాలలో, రాష్ట్ర ప్రభుత్వంచే కళారత్న పురస్కారం అందుకున్న ప్రసిద్ధ కవి కథకుడు దాట్ల దేవదానం రాజును, ఎస్‌డివిఆర్ఆర్ పాఠశాల పాలకవర్గం గ్రామస్తులు, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ దంతులూరి అనం తవర్మ మాట్లాడుతూ, కోలంక గ్రామం ఉపాధ్య యులు, పాఠశాల పూర్వ విద్యార్థి, దేవదానం రాజు ప్రతిష్టాత్మక అవార్డు పొందినందుకు గర్వపడుతున్నా మని, దాట్ల సాహిత్య కృషి ప్రశంసనీయమని, ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యుడు మల్లిపూడి రంగారావు, వీరభద్ర రాజు, శేషారావు, నామవాణి, పాలెం సర్పంచ్ భూపతి రాజు, వెంకట సూర్యనారాయణ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధే తన ధ్యేయం

విశాలాంధ్ర - గోపాలపురం : పంచాయతీ పరిధిలో వివిధ ప్రాంతాల అభివృద్ధి చెందించడం తన ధ్యేయమని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు తెలిపారు. శుక్రవారం స్థానిక గోపాలపురంలోని పెద్దగూడెం రజక పేట ఉప్పర గూడెం ప్రాంతాలలోని అనేక డ్రైన్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ రూ 1.25 కోట్లతో డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేసి ప్రజా ఆరోగ్యాన్ని మెరుగుపరచనున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా వర్షాకాలంలో తరచూ ముంపునకు గురవుతున్న రజక పేట సంబంధించి రూ. 45 లక్షలతో పక్కా డ్రైనేజీ వ్యవస్థను నిర్మించి ముంపు ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఉప్పరగూడెం ప్రాంతంలో వర్షాకాలం వాడాలకుంట వైపు నుంచి వస్తున్న వరదనీటి కారణంగా పలు లోతట్టు ప్రాంతాలు జలమయమై ఇళ్లు మునిగిపోతున్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని వెళ్లగా రూ. 25 లక్షలతో పక్కా డ్రైనేజీ దానికి ఇరువైపులా రివిట్మెంటు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. అదేవిధంగా పెద్దగూడెం వెళ్లే ప్రధాన డ్రైనేజీ అభివృద్ధి పరిచే క్రమంలో భాగంగా 25 లక్షలతో డ్రైనేజీ నిర్మాణము చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ అభివృద్ధి పనులకు జిల్లా పరిషత్తు నుండి నిధులు సేకరించినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పీఆర్ఏ ఈ వినయ్‌కుమార్, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు రొంగల సత్యనారాయణ, గ్రామ కమిటీ అధ్యక్షులు శ్రీధర్, మాజీ గ్రామ కమిటీ అధ్యక్షులు మద్దిపాటి రమేష్, మాజీ ఎంపీటీసీ కోనపాము ప్రసాద్ బాబు, టీడీపీ నాయకులు నూతంగి దొరబాబు, నీటి సంఘం అధ్యక్షులు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ పడమటి శ్రీనివాసరావు, బురెడ్డి వాసు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంతాన సాఫల్య కేంద్రంలో ప్రపంచ శ్రేణి పరిజ్ఞానం



విశాలాంధ్ర- రాజమహేంద్రవరం: స్థానిక ఫెర్టి9 సంతాన సాఫల్య అత్యాధునిక ప్రపంచ శ్రేణి సాంకేతిక పరిజ్ఞానం అవిష్కరించినదని డాక్టర్ సౌమ్య వరుదు తెలిపారు. ఫెర్టి9 సంతాన సాఫల్య కేంద్రం ఎన్నో జంటలకు వైద్య రంగంలోని సవాళ్ళను అధిగమించి సంతాన సాఫల్యతకు మార్గాన్వేషణ చేస్తున్నదన్నారు. ఫెర్టి 9 సంతాన సాఫల్య కేంద్రం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రలలోను 11 సంతాన సాఫల్య కేంద్రాలను కలిగి టైర్-2, టైర్-3 నగరాలలో ప్రపంచ స్థాయి సంతానోత్పత్తి సాంకేతికతలను ప్రవేశపెటుతు న్నదన్నారు. స్త్రీలకు లాపరోస్కోపి, హిస్టెరోస్కోపి ప్రతిరోగికి సకాలంలో సరైన చికిత్సా విధానాలను ఫెర్టి9 రాజమండ్రి కేంద్రం కలిగి ఉన్నదన్నారు. డాక్టర్ సౌమ్య వరుదు, ఫెర్టి9 ఫెర్టిలిటి సెంటర్, రాజమండ్రి వారు మాట్లాడుతూ సంతానలేమితో బాధపడే వారికి ఒక సంపూర్ణమైన విధానం ద్వారా శాస్త్రీయంగా వారికి అవసరమైన మానసిక, శారీరక స్థితులను అంచనా వేసి సంతానోత్పత్తి చికిత్సను అందిస్తున్నామని చెప్పారు. రాజమండ్రి ఫెర్టి9 సెంటర్ యొక్క ఫెర్టిలిటి స్పెషలిస్ట్ డాక్టర్ అశ్విని ఉయ్యూరి ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి జంటకు అధునాతన సంతానోత్పత్తి సంరక్షణను అందుబాటులోకి తీసుకురావడమే మా లక్ష్యమన్నారు. నైతిక విలువలకు కట్టుబడి అధునిక వైద్యరంగ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా సంతానోత్పత్తికి అవకాశాలు కల్పించటం జరిగినదన్నారు. ఫెర్టి9 సెంటర్ కేవలం చికిత్సకు మాత్రమే పరిమితంకాక, సామాజిక విద్య అవగాహన కార్యక్రమాలలో చురుకూగా పాల్గొంటున్న దన్నారు. స్థానిక కుటుంబాలకు అవసరమైన ఆరోగ్యసంరక్షణను అందిస్తు, సంతానోత్పత్తి పట్ల అవగాహన కలిగిస్తునదన్నారు.

నేరాల నియంత్రణకు ఆధునాతన సాంకేతికత

విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం రూరల్: నేరాల నియంత్రణ కోసం అధునాతన సాంకేతికను వినియోగిస్తున్నట్లు ఏలూరు రేంజ్ ఐజి అశోక్ కుమార్ తెలిపారు. జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్లో ఆయన శుక్రవారం మాట్లాడుతూ సుమారుగా రూ.35 లక్షల వ్యయంతో 70 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. స్టేషన్లో సిబ్బందిని పెంచి నేరాల అదుపునకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రేంజ్ పరిధిలో ఉన్న 6 జిల్లాల్లో నేరాల నియంత్రణ కోసం సుమారు 22 వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

20న చంద్రన్న ఉద్యోగ భవన్ ప్రారంభం

విశాలాంధ్ర - కాజులూరు : నవ్యాంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలల సహకారం నిరుద్యోగ నిర్మూలన దిశగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ నూతన కార్యక్రమానికి రాష్ట్రంలో తొలిసారిగా శ్రీకారం చుట్టారు. తన నియోజకవర్గ రామచంద్రపురంలో చంద్రన్న ఉద్యోగ భవన్ కార్యాలయాన్ని ఈనెల 20న ప్రారంభించి, ఉద్యోగులకు తక్షణం ఉద్యోగ అవకాశం కల్పించే దిశగా, ఏర్పాటు చేస్తున్నారు. సుమారు 300 కంపెనీలతో అవగాహన ఒప్పందం చేసుకుని, పదవ తరగతి నుంచి పీజీ వరకు చదువుకొని నిరుద్యోగులకు ఉద్యోగం కల్పించే దిశగా రాష్ట్రంలోనే తొలిసారిగా చంద్రన్న ఉద్యోగ భవన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగం రూపుమాపే ఉన్నత ఆశయంతో సీఎం చంద్రబాబు ఆశయాన్ని కనుగొనంగా ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని తనను అత్యధిక మెజారిటీతో గెలిపించిన రామచంద్రపురం నియోజవర్గ ప్రజల రుణం తీర్చుకునేందుకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. చదువుకొని ఉపాధి అవకాశాలు లేని వారికి ఉపాధి కల్పించడమే ఈ చంద్రన్న ఉద్యోగ భవన్ కర్తవ్యమన్నారు, ఈ చంద్రన్న ఉద్యోగ భవన్ నిరంతరం అందుబాటులో ఉంటుందన్నారు. వీటి ద్వారా సుమారు మూడు లక్షల ఉద్యోగాలు కల్పన జరుగుతుందన్నారు. అదేవిధంగా చిన్న సూక్ష్మ మధ్యతరహా పరిశ్రమాలు, ఏర్పాటు ఎంఎస్ఎంఈ ద్వారా నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పిస్తామన్నారు. నిరుద్యోగులు లేని నియోజకవర్గంగా రామచంద్రపురంను తీర్చిదిద్దాలని ముఖ్య ఉద్దేశంతో, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ స్థాపించి ఇప్పటికే 10 జాబ్ మేళాలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్టు మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు.

20న జీ తెలుగులో కామెడీ ఎంటర్‌టైనర్ మజాకా

విశాలాంధ్ర/రాజమహేంద్రవరం: తెలుగు ప్రేక్షకులకు అంతులేని వినోదం అందించడంలో ఎప్పుడూ ముందుండే జీ తెలుగు ఈ వారం మరో సూపర్ హిట్ సినిమాతో వచ్చేస్తోందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. సందీప్ కిషన్, రీతూ వర్మ, రావు రమేష్, అన్షు సాగర్ ప్రధాన పాత్రల్లో నటించిన 'మజాకా' సినిమాని వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్‌గా అందిస్తోందన్నారు. ఈ సినిమా కథ విశాఖపట్నంలో సాధారణ జీవితాన్ని గడిపే కృష్ణ (సందీప్ కిషన్), అతని తండ్రి వెంకట రమణ (రావు రమేష్) చుట్టూ తిరుగుతుందన్నారు. తండ్రీకొడుకులు ఎవరికి వారు పెళ్లి చేసుకోవాలన్న సరదా సన్నివేశాలు, వారి జీవితాల్లోకి ప్రవేశించిన మీరా (రీతూ వర్మ), యశోద (అన్షు సాగర్) పాత్రలు, వారి వివాహాలు ఎలా జరుగుతాయనే విషయాలు తెలియాలంటే జీ తెలుగులో ప్రసారమయ్యే మజాకా సినిమా తప్పకుండా చూడాల్సిందేనని అన్నారు. మజాకా కామెడీ ఎంటర్‌టైనర్‌గా థియేటర్లలో ప్రేక్షకులను మెప్పించింది. ఈ సినిమాలోని హృదయాలను హత్తుకునే సన్నివేశాలు, భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి. సందీప్ కిషన్, రీతూ వర్మ, రావు రమేష్, అన్షు సాగర్ ప్రధాన పాత్రలు పోషించగా మురళీ శర్మ, హైపర్ ఆది, శ్రీనివాస్ రెడ్డి ఇతర ముఖ్యపాత్రల్లో నటించారు.